Follow: @ANNTELUGU
02-07-2026
# మహా పత్రిక
ANN తెలుగు
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 178 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఆధారాలు లేని ఆరోపణలు సహించం

### సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక

**అమరావతి, మహా :** సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు.మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు. సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

టాప్ న్యూస్



### కేసీఆర్ గొప్పగా పాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారు?

ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాల్జేసింది: మంత్రి జూపల్లి

03



### రాముడి గుడిలోనే దొంగతనమా?

మోదీ, అమిత్ షాలపై జగ్గారెడ్డి ఆగ్రహం

02



### పాలనపై చర్చకు రెడీ.. తేదీ చెప్పండి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

ప్రజలు హిట్లర్ ముగింపే ఇస్తారు

02



# ఎమ్మెల్సీలపై గురి

## నల్లగొండకు గుత్తా అమిత్?

- హైదరాబాద్ రంగారెడ్డి సీటు కోసం బిగ్ ఫైట్
- స్వయంగా పరిశీలిస్తున్న సీఎం రేవంత్
- రేసులో సంపత్ కుమార్, సామ రామ్మోహన్ రెడ్డి, బొంతు రామ్మోహన్
- నల్లగొండ-వరంగల్ పై బీఆర్ఎస్, హైదరాబాద్ పై బీజేపీ కన్ను
- త్వరలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు కూడా

**(హైదరాబాద్-మహా)**

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశమున్నా.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి.. ఓటర్ల నమోదు, ప్రచారం సుదీర్ఘ ప్రయాసలతో కూడుకున్న కార్యక్రమం కావడంతో దీనిపైన కన్నేసిన ప్రధాన పార్టీలు ఏడాది ముందు గానీ, కనీసం ఆరు మాసాల ముందుగానే స్పష్టత ఇవ్వడం ఆనవాయితీగా ఉంది. అలాంటివారినే విజయం పలకరిస్తోంది. చివరిదాకా తటపటాయించిన వారు వెనుకబడుతున్నారు. నల్లగొండ ఎమ్మెల్సీ విషయంలో కాంగ్రెస్ ముందస్తు ఖరారుతో లాభపడగా, కరీంనగర్ లో చివరిదాకా సాగదీసి బోల్తాపడింది. ఇపుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్రాంతాలు, స్వతహాగా కాంగ్రెస్ కు కంచుకోటలు, ఇందులోనూ ఒకటి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత

మిగతా 2వ పేజీలో




# నాడు అక్రమం.. నేడు సక్రమమా..?


## పీరం చెరువు బఫర్ జోన్ ఆక్రమణ

ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు పత్తాలేని హైడ్రా

02





నాడు అక్రమని అధికారులు అడ్డుకున్నారు.. నేడు సక్రమంటూ అనుమతులు జారీ చేయటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. బండ్లగూడ జాగీర్ సర్కిల్ పీరం చెరువు బఫర్ జోన్ ఆక్రమించిన అక్రమార్కులు దూరక్రమణకు తెగబడ్డారు.చెరువులు, నాలాలు, కుంటలను కాపాడాలానే సంకల్పంతో కోట్లాది రూపాయిలు వెచ్చించి ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటు చేసి పూర్తి స్వేచ్ఛను అప్పగించింది..హైడ్రా అధికారులు సైతం కన్నెత్తి చూడక పోవటం పలు విమర్శలకు తావిస్తోంది..ఎన్ని చట్టాలు తెచ్చిన అవినీతి అధికారుల ధన దాహానికి అవి వెల వెల బోతున్నాయి.. రియల్టర్లు విసిరిన కాసులకు కక్కుర్తి పడి పీరం చెరువు బఫర్ జోన్ లో ఉన్న స్నేహిత బిల్డర్స్ కు ఎన్వోసి జారీ చేసి ఇరిగేషన్ చట్టాలకు తూట్లు పొడిచారని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి... ఇరిగేషన్ ఎన్వోసి తో సదరు బిల్డరు పెట్రోల్ బంకు ను ఏర్పాటు చేయటానికి నిర్మాణ అనుమతులు పొందటం అవినీతి అధికారుల ధన దాహానికి పరాకాష్టగా నిలుస్తోందన్నారు..

### విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

- భగ్నం చేసిన ఇంటెలిజెన్స్
- కుట్ర వెనుక డీఎంకే నేతలు

03

# ఆదాయ లీకేజీలకు అడ్డుకట్ట

- పర్యవేక్షణకు 'చేజింగ్ సెల్'.
- బడ్జెట్ లక్ష్యాల సాధనపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం.
- ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం.

03



### రూ.14,115 కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఢిల్లీలో భారీ ద్వారకా టన్నెల్.
- ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం.
- రైల్వేలు, మెట్రోలు, విమానాశ్రయాలకు భారీ పెట్టుబడులు.
- మౌలిక వసతుల విస్తరణకు మోదీ సర్కార్ కీలక నిర్ణయాలు.

03




### వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం నజర్

02

- ఆన్‌లైన్ మోసాలపై ప్రభుత్వం అప్రమత్తం
- ఫోన్ నంబర్ గోప్యతకు రక్షణ
- త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఫీచర్ ప్రారంభం
- ఒకే యూజర్‌నేమ్‌కు మెటా అవకాశం

### వచ్చే ఎన్నికలు 'మావిగన్' వర్సెస్ అమరావతి

అవినీతి లేని రాజధాని నిర్మాణమే మా అజెండా.
రాష్ట్రంలో అమలవుతున్నది 'రెడ్ బుక్ రాజ్యాంగం.
ప్రభుత్వ తీరుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు.

02





# నాడు అక్రమం.. నేడు సక్రమమా ..?

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని గండి పేట మండలం బండ్లగూడ జాగీర్ పీరం చెరువు బఫర్ జోన్ దురాక్రమణకు గురైంది. సర్వే నెంబర్ 24/ఏ /2 స్నేహిత బిల్డర్స్ పేరుతో బఫర్ జోన్ ను ఆక్రమించారు. అంతే కాకుండా పక్కనే ప్రవహిస్తోన్న నాలాను సైతం చెరబట్టారు.హెచ్ ఎం డీ ఏ లేక్స్ మ్యాపులో గుర్తించిన ప్రకారం పీరం చెరువు ఐ డీ నెంబర్ 2933 గా ఇరిగేషన్ రికార్డుల బట్టి తెలుస్తోంది.దీని విస్తరణ 30.801ఎకరాలు కాగా, ఫుల్ ట్యాంక్ లెవల్ 1848.458 (ఎఫ్ టీ ఎల్ )మీటర్లగా ఇరిగేషన్ అధికారులు నిర్ణయించి 24మీటర్ల మేరకు బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేసారు. సర్వే నెంబర్ 24/ఏ /2లో గల భూమి సుమారు 1400 గజాలు పూర్తిగా బఫర్ జోన్ లో వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇదిలా ఉంటే ఇదే స్థలంలో ట్రాక్టర్లతో మట్టి పోసి నింపుతుండగా అప్పటి రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరసింహాగౌడ్ అడ్డుకొని ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేసారని అప్పుడు అక్రమమని బఫర్ లో ఉందని తేల్చిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు.. ఇప్పుడు అది సక్రమం అంటూ ఎన్వొసీలు ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.బఫర్ జోన్ ఆక్రమించి సదును చేయటమే కాకుండ అనుమతులు లేకుండా రెండు బోర్లు వేసారని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేస్తే నేటి వరకు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని లంచాలు మింగి అక్రమార్కులకు రాచ బాట వేశారని స్థానిక ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు . ఇరిగేషన్ ఎన్వొసి ఆధారంగా ఆనాటి బండ్లగుడా జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి నిర్మాణ అనుమతులు పొందారని వారు ఆరోపిస్తున్నారు.











## అడ్డదారిలో అనుమతులపై చర్యలేవి..?

పీరం చెరువు బఫర్ జోన్ ను ఆక్రమించి అడ్డదారిలో అనుమతులు పొందిన వారిపై చర్యలేవని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి సర్వే నెంబర్ 24/ఏ /2 లో గల భూమి పీరం చెరువు బఫర్ జోన్లో నే ఉందని నిర్ధారించి ఎన్వొసీలు నిరకరించారు.. ఓ మాజీ మంత్రి తనయుడు బావమరిది అంటూ అధికారులను మచ్చిక చేసుకొని అడిగినంత ముడుపులు ముట్టజెప్పి అడ్డదారిలో బండ్లగూడ జాగీర్ సర్కిల్ నుండి దర్జాగా అనుమతులు పొందటం అధికారుల అవినీతిని ఎత్తిచూపిస్తోంది. ఇప్పటికైనా హైడ్రా అధికారులు స్పందించి పీరం చెరువు బఫర్ ఆక్రమణ పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బఫర్ ను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# వచ్చే ఎన్నికలు 'మావిగన్' వర్సెస్ అమరావతి

**అమరావతి, మహా :** రాబోయే సార్వత్రిక ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి' విధానాల మధ్య జరగనున్నాయని, తమ పార్టీ 'మావిగన్' అజెండాతోనే ప్రజల ముందుకు వెళ్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ విధానానికి మద్దతు ఇవ్వాలన్నది ఎన్నికల్లో ప్రజలే తేలుస్తారని ఆయన అన్నారు. రాజధాని నిర్మాణంలో ఎలాంటి అవినీతి, స్కాములకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా అభివృద్ధి చేయాలన్నదే 'మావిగన్' ఉద్దేశమని వివరించారు. ఇదే అజెండాతో తాము ఎన్నికలకు వెళ్తామని, ప్రజలు ఇచ్చే తీర్పుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఆయన కుండబద్దలు కొట్టారు.



**రైతుల వద్దకు రిటైర్డ్ జడ్జీలు**

రాజధాని ప్రాంతంలో తన పర్యటనపై వస్తున్న విమర్శలకు వైఎస్ జగన్ ధీటుగా బదులిచ్చారు. తాను రాజధాని ప్రాంతంలో పర్యటించడం ఏమాత్రం సమస్య కాదని, అయితే కొందరు పనిగట్టుకుని దాన్ని రాజకీయ అంశంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇకపై రాజధాని రైతులతో చర్చలు జరిపేందుకు, క్షేత్రస్థాయి పరిస్థితులను నిశితంగా పరిశీలించేందుకు రిటైర్డ్ జడ్జి స్థాయి వ్యక్తులను పంపించే ఆలోచన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తాను ఎల్లప్పుడూ రైతుల పక్షానే నిలబడతానని, వారి గొంతుకగా మాట్లాడుతున్నానని ఉద్ఘాటించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తామని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడకు తమ పార్టీ నాయకులు వెళ్లి బాధితులకు అండగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. ప్రజల ప్రయోజనాల కోసం పోరాడేందుకు ఎవరైనా ముందుకు వస్తే వారితో కలిసి నడుస్తామని, అవసరమైతే ఆయా ఉద్యమాల్లో తాను సైతం ప్రత్యక్షంగా పాల్గొంటానని ఆయన ప్రకటించారు.

**ఆధారాలుంటే ఖండించండి..**

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనపై జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన కాకుండా 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలవుతోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. గత తమ ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్లకు, మతానికి ఎలాంటి సంబంధం లేదని అసెంబ్లీలో తీర్మానం చేశామన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇక డీఎస్సీ అంశంపై స్పందిస్తూ.. తమ పార్టీ పక్కా ఆధారాలతోనే మాట్లాడుతోందని స్పష్టం చేశారు. తాము చేసిన ఆరోపణలు తప్పని ప్రభుత్వం భావిస్తే, కేవలం ప్రచారం కోసం ఎదురుదాడి చేయడం మాని, వాస్తవాలను ఆధారాలతో సహా ఖండించాలని సవాల్ విసిరారు. నిరాధారమైన ఆరోపణలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారన్న విషయాన్ని పాలకులు మర్చిపోకూడదని హెచ్చరించారు.

**విద్వేషాలు కాదు.. మంచి చేయాలి**

రాజకీయాల్లో పార్టీల మధ్య పరస్పర విమర్శలు సహజమే అయినప్పటికీ, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం ఏమాత్రం సరికాదని జగన్ హితవు పలికారు. అధికార పార్టీ తమ నాయకులను అదుపులో ఉంచుకునే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టకుండా ప్రజలకు మంచి చేయాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే తమ పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యమని, రానున్న ఎన్నికల్లోనూ ఇదే అజెండాతో ప్రజల తీర్పు కోరుతామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# నేను బటన్ నొక్కే వ్యక్తిని కాదు.. ప్రజల్లో ఉండే వ్యక్తిని

**నెల్లూరు,మహా :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తాను కేవలం బటన్ నొక్కి పథకాలు ప్రకటించే నాయకుడిని కాదని, నేరుగా ప్రజల్లో ఉండి వారి సమస్యలు తెలుసుకుంటూ పాలన సాగించే వ్యక్తినని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో మాట్లాడిన ఆయన పేదల ముఖాల్లో చిరునవ్వు చూడడమే తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 62.20 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఏటా రూ.33 వేల కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. మొత్తం 28 రకాల కేటగిరీల కింద అర్హులైన వారికి పెన్షన్లు అందుతున్నాయని, ఒక నెలలో పెన్షన్ తీసుకోలేకపోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకేసారి చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. తాను బటన్ నొక్కి కార్యక్రమాలు ముగించే నాయకుడిని కాదని, ప్రజల మధ్య ఉండి వారి సమస్యలకు ప్రత్యక్ష పరిష్కారాలు చూపే వ్యక్తినని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ పాలన సాగించడమే తన నమ్మకమని, సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమానంగా కొనసాగుతుందని తెలిపారు.

**రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి కృషి**

రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి భుజాన వేసుకున్నామని చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ సుపరిపాలనకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 'మనమిత్ర' అనువర్తనం ద్వారా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రస్తుతం అన్ని శాఖలను సమర్థవంతంగా గాడిలో పెడుతున్నామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తోందని చెప్పారు. నెల్లూరు జిల్లాను దేశంలోనే నంబర్ 1 జిల్లాగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. జిల్లాకు 27 భారీ పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. గూడూరులో దేశంలోనే అతిపెద్ద ఫర్నిచర్ పార్క్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. దేశానికి వచ్చే మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే రావడం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.



**నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం**

రాష్ట్ర భవిష్యత్తు కోసం నదుల అనుసంధానం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయడం కూటమి ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గోదావరికావేరి అనుసంధానానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రజా రవాణాలో పూర్తిస్థాయిలో ఎయిర్ కండిషన్డ్ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. గత ఏడాది జూన్‌కే ప్రాజెక్టులకు నీటి ప్రవాహం ప్రారంభమైందని, కానీ ఈసారి జూలై వచ్చినా పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. వర్షాభావం కారణంగా కృష్ణా, గోదావరి నదుల నుంచి కూడా తగిన నీరు అందే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి నిర్వహణలో దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రపంచ పరిస్థితుల ప్రభావంతో ధరలు పెరుగుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యుద్ధాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రజలు తెలివిగా వ్యవహరించాలని సూచించారు. దేశం మనకు ఏమిచ్చిందని కాకుండా, మనం దేశానికి ఏమిచ్చామనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం కోసమే తన ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒక 'గొడ్డలి పార్టీ' ఉందంటూ ప్రతిపక్షంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిరోజూ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు అందరూ మద్దతు తెలిపినా, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని ఆరోపించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని అన్నారు. రాజధానిని వ్యతిరేకించినందుకే ప్రజలు గత ఎన్నికల్లో తీవ్రంగా తిరస్కరించారని వ్యాఖ్యానించారు.



## రాముడి గుడిలోనే దొంగతనమా?

**మోదీ, అమిత్ షాలపై జగ్గారెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్, మహా :** అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన హుండీ డబ్బుల చోరీ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నా, రామాలయ ట్రస్ట్ వారి పరిధిలోనే నడుస్తున్నా... ఈ దొంగతనం జరిగిందని ఆయన అన్నారు. ఈ చోరీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇన్నేళ్లుగా రాముడి పేరును కేవలం రాజకీయాల కోసం, ఓటు బ్యాంక్ కోసమే బీజేపీ వాడుకుందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై విచారణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీల బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, ఈ వైఫల్యానికి గాను ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... కేటీఆర్ ప్రస్తుతం ఖాళీగా ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తూ పాలనలో బిజీగా ఉన్నారని చెప్పారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ రెడ్డే సీఎంగా కొనసాగుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీలపై గురి

(మొదటి పేజీ తరువాయి )

గెలిచి ఉండడంతో ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి ప్రస్తుత డెయిరీ డెవలప్ మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేరు వినబడుతుండగా, ఇంకా అనేకమంది నేతలు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటినుండే నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రధానంగా సోషల్ మీడియా ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి పేరు వినబడుతుండగా, రెండు ఎమ్మెల్సీల్లో ఒకటి రెడ్డికి, మరొకటి బీసీ లేదా ఎస్సీవర్గానికి ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్లు కూడా వినబడుతున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సోషల్ మీడియా వ్యూహాలు కూడా ఎంతో కీలకం. దీనితో సోషల్ దూకుడు కూడా కీలకంగా మారింది.

**నల్లగొండ పై బీఆర్ఎస్, హైదరాబాద్ పై బీజేపీ కన్ను**

నల్లగొండ, వరంగల్, ఖమ్మం స్థానంపై రాకేష్ రెడ్డి మరోసారి కన్నేయగా,. పార్టీ కూడా ఆయన అభ్యర్థిత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి నిరుద్యోగులను ఆకట్టుకునేలా ఆయన సభలు, సమావేశాలు మొదలుపెట్టారు. మరోవైపు హైదరాబాద్ నుండి గతంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గెలిచిన సందర్భాలు ఉండగా, ఈ దఫా ఈ సీటును హైకమాండ్ ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది.

**ఈ ఏడాదే గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు**

త్వరలో గవర్నర్ కోటా నుండి మూడు ఎమ్మెల్సీలు ఖాళీ కానుండగా, వీటిపై అనేకమంది సీనియర్ నేతలు కన్నేశారు. జిల్లాల సమీకరణలు పరిగణనలోకి తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. గెలిచి ఉండడంతో ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి ప్రస్తుత డెయిరీ డెవలప్ మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేరు వినబడుతుండగా, ఇంకా అనేకమంది నేతలు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటినుండే నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రధానంగా సోషల్ మీడియా ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి పేరు వినబడుతుండగా, రెండు ఎమ్మెల్సీల్లో ఒకటి రెడ్డికి,



మరొకటి బీసీ లేదా ఎస్సీవర్గానికి ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్లు కూడా వినబడుతున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సోషల్ మీడియా వ్యూహాలు కూడా ఎంతో కీలకం. దీనితో సోషల్ దూకుడు కూడా కీలకంగా మారింది.

**నల్లగొండ పై బీఆర్ఎస్, హైదరాబాద్ పై బీజేపీ కన్ను**

నల్లగొండ, వరంగల్, ఖమ్మం స్థానంపై రాకేష్ రెడ్డి మరోసారి కన్నేయగా,. పార్టీ కూడా ఆయన అభ్యర్థిత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి నిరుద్యోగులను ఆకట్టుకునేలా ఆయన సభలు, సమావేశాలు మొదలుపెట్టారు. మరోవైపు హైదరాబాద్ నుండి గతంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గెలిచిన సందర్భాలు ఉండగా, ఈ దఫా ఈ సీటును హైకమాండ్ ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది.

**ఈ ఏడాదే గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు**

త్వరలో గవర్నర్ కోటా నుండి మూడు ఎమ్మెల్సీలు ఖాళీ కానుండగా, వీటిపై అనేకమంది సీనియర్ నేతలు కన్నేశారు. జిల్లాల సమీకరణలు పరిగణనలోకి తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

# పాలనపై చర్చకు రెడీ.. తేదీ చెప్పండి

**రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

**ప్రజలు హిట్లర్ ముగింపే ఇస్తారు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రం దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి భావ దారిద్ర్యంతో మాట్లాడుతున్నారని ఎంత దివాలాకోరు మనిషైనా నేను దివాలా తీశాను అని చెప్పి మెడలో బోర్డు వేసుకొని తిరడని, కానీ రేవంత్ రెడ్డి ప్రతిసారి తెలంగాణ రాష్ట్రం పై విషం చిమ్ముతూనే ఉన్నాడని మండిపడ్డారు. తమ హయాంలో కేంద్రం సహకరించకున్నా అద్భుతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోయామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి స్వయంగా సమయం, స్థలం నిర్ణయించి చెబితే చర్చకు వస్తానన్నారు. నిజంగానే రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ ప్రకటించారు. సీఎం, అయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడి వల్లనే తెలంగాణ దివాళ తీస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో ప్రతి రంగం అగ్రస్థానం వైపు పయనిస్తే రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం పాతాళానికి పడిపోతుందని అన్నారు. నిజంగానే రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించాలని, మద్యం అమ్మకాలను నిషేధించాలని కేటీఆర్ సవాలు విసిరారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి పాలన పైన కోపంగా ఉన్నారని, అన్ని గమనిస్తున్నారని, చివరికి రానున్న రోజుల్లో బాహుబలి సినిమాలో భల్లాల దేవునికి పట్టిన గతే పడుతుందని అన్నారు. తాను నమ్మిన హిట్లర్ కి ఎలాంటి ముగింపు కలిగిందో అలాంటి ముగింపే ప్రజలు రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇస్తారని కేటీఆర్ అన్నారు.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం నజర్

**ఆన్‌లైన్ మోసాలపై ఆందోళన.**

**ఢిల్లీ, మహా :** ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ త్వరలో తీసుకురానున్న 'యూజర్‌నేమ్' సరికొత్త ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ కొత్త ఫీచర్ కారణంగా ఆన్‌లైన్ మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మార్పుతో యూజర్ల భద్రత, వ్యక్తిగత డేటాపై ఎలాంటి ప్రభావం పడుతుందనే సున్నితమైన విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులు నిశితంగా సమీక్షిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.వినియోగదారుల వ్యక్తిగత గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే ఉద్దేశ్యంతోనే ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వాట్సాప్ మాతృసంస్థ 'మెటా' ఇదివరకే ప్రకటించింది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే అపరిచితులతో చాట్ చేసేటప్పుడు యూజర్లు తమ వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను షేర్ చేయాల్సిన అవసరం ఏమాత్రం ఉండదు. కేవలం యూజర్‌నేమ్ ద్వారానే ఇతరులతో సంభాషించే అద్భుతమైన వెసులుబాటు కలుగుతుంది. ముఖ్యంగా కొత్తవారితో తొలిసారి చాటింగ్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతను కాపాడుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని మెటా చెబుతోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు ప్రయోగాత్మకంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చిన సంస్థ, త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది.



ఈ ఫీచర్ వినియోగం గురించి మెటా స్పష్టతనిచ్చింది. ఇది అందుబాటులోకి రాగానే వినియోగదారులు ముందుగా తమ వాట్సాప్‌ను లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'సెలెక్టింగ్ యూజర్‌నేమ్' అనే ఆప్షన్‌ను ఎంచుకుని, తమకు నచ్చిన పేరును వాట్సాప్ అకౌంట్‌కు క్రియేట్ చేసుకోవచ్చు. మరోవైపు, కంటెంట్ క్రియేటర్లు, భారీ కార్పొరేట్ సంస్థలు, చిన్న తరహా వ్యాపారులు తమ బ్రాండ్ ఐడెంటిటీ కోసం వివిధ మెటా ప్లాట్‌ఫారమ్‌లకు ఒకే యూజర్‌నేమ్‌ను ఎంచుకునే అవకాశాన్ని కూడా సంస్థ కల్పిస్తోంది. అంటే, ఇప్పటికే వారు వాడుతున్న ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ యూజర్‌నేమ్‌లనే వాట్సాప్‌కు కూడా వినియోగించుకోవచ్చు. ఆయా దేశాల్లో ఈ ఫీచర్ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన వెంటనే వినియోగదారులకు నేరుగా నోటిఫికేషన్ల ద్వారా సమాచారం అందిస్తామని మెటా స్పష్టం చేసింది.

## ఆలయ స్తంభాలు కూల్చిన వారి పై
# చట్టరీత్య చర్యలు తప్పవు

- **ఈ ఘటనపై అసత్య ప్రచారాలు రెచ్చగొట్టే సందేశాలను పోస్ట్ చేస్తే కఠిన చర్యలు**
- **మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు**

**వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్వాడ పోలీస్ స్టేషన్ లో క్రైం నం. 330/2026,బి.ఎన్.ఎస్ సెక్షన్ 196(1)(ఎ), 298 కింద కేసు నమోదు చేయబడినది. ఈ సంఘటన 30 6 2026, 1 7 2026 మధ్య రాత్రి సుజిత్ నగర్, బ్యాంక్ కాలనీ2, వరంగల్ ప్రాంతంలో చోటు చేసుకున్నట్లు ఫిర్యాదుదారు విశ్వపతి జగదీష్, తండ్రి హనుమయ్య చారి, వయస్సు 50 సంవత్సరాలు, వృత్తి వడ్రంగి, నివాసం సుజిత్ నగర్, వరంగల్ వారు 1 7 2026 సాయంత్రం 5.45 గంటలకు మట్వాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, తాను కాలనీ వాసులు బండి శివ, పి. శ్రావణ్, వి. శోభ, రాజ్ కుమార్, లలిత తదితరులు కలిసి 2021 సంవత్సరంలో సుజిత్ నగర్ బ్యాంక్ కాలనీ2లో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, విగ్రహం చుట్టూ సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ దీపారాధన నిర్వహిస్తూ, అక్కడ ఆలయ నిర్మాణానికి కూడా సన్నాహాలు చేస్తున్నారు. 30 6 2026 రాత్రి సుమారు 8 00 గంటలకు ఫిర్యాదుదారు విగ్రహం వద్ద దీపం వెలిగించి ఇంటికి వెళ్లగా, 1 7 2026 ఉదయం సుమారు 10.00 గంటలకు తిరిగి వెళ్లి చూడగా సిమెంట్ స్తంభాలు ధ్వంసం చేయబడినట్లు, అక్కడ ఏర్పాటు చేసిన జెండాలు కూల్చి వేయబడినట్లు, అలాగే శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సమీపంలోని మోరి లో పడ వేసినట్లు గుర్తించారు. ఈ ఘటన పై గుర్తుతెలియని వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది.దర్యాప్తు క్రమంలో లభించిన ఆధారాల మేరకు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించడం జరుగుతోంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో శాస్త్రీయ ఆధారాలతో సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది. నేరానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది ఏమనగా, ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి పుకార్లు, అసత్య ప్రచారాలు లేదా రెచ్చగొట్టే సందేశాలను సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం చేయవద్దు, షేర్ చేయవద్దు. మత సామరస్యానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, పోస్టులు లేదా సందేశాలు పంపిణీ చేసిన చట్టరీత్యా శిక్షార్హులు అని ప్రజలందరూ ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు పోలీసు శాఖ చేపట్టింది. ప్రజలు సంయమనం పాటించి, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, సామాజిక మత సామరస్యాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమాచారాన్ని ప్రెస్ నోట్ ద్వారా మీడియా విడుదల చేయడం జరిగిందని ఇన్స్పెక్టర్ తెలిపారు.

# రూ.14,115 కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దేశవ్యాప్తంగా రహదారులు, రైల్వేలు, మెట్రోలు, విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం రూ.14,115 కోట్ల విలువైన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ద్వారకా టన్నెల్ నిర్మాణంతో పాటు ఉత్తరప్రదేశ్‌లో కనెక్టివిటీని మెరుగుపరిచే కాన్పూర్-కబ్రాయ్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు.

**ద్వారకా టన్నెల్‌కు ఆమోదం**

కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత ప్రాధాన్యం పొందిన ప్రాజెక్టు ఢిల్లీలో నిర్మించనున్న ద్వారకా టన్నెల్. దాదాపు రూ.6,970 కోట్ల వ్యయంతో ఆరు లేన్ల భూగర్భ టన్నెల్‌ను నిర్మించనున్నారు. మొత్తం 8.1 కిలోమీటర్ల పొడవుతో రూపొందనున్న ఈ కారిడార్ రాజధానిలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించనుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న శివమూర్తి ఇంటర్‌చేంజ్ నుంచి ప్రారంభమయ్యే ఈ మార్గం వసంత్ కుంజ్, నెల్సన్ మండేలా మార్గ్ మీదుగా బారాపుల్లా ప్రాంతంలోని ఎలివేటెడ్ కారిడార్‌ను చేరుకుని చివరకు డీఎన్‌డీ ఫ్లైఓవర్‌తో అనుసంధానం కానుంది. దీంతో పశ్చిమ ఢిల్లీ, గురుగ్రామ్ ప్రాంతాల నుంచి దక్షిణ, తూర్పు ఢిల్లీ వైపు ప్రయాణించే వారికి సమయం, ఇంధనం రెండూ ఆదా కానున్నాయి.

**రిడ్జ్ అడవులకు రక్షణ**

ఢిల్లీ నగరానికి ఊపిరితిత్తులుగా భావించే సదరన్ రిడ్జ్ అటవీ ప్రాంతానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రాజెక్టును అమలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఆదేశించినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అందుకే అడవిని తాకకుండా పూర్తిగా భూగర్భ మార్గంలోనే టన్నెల్ నిర్మాణం చేపడతామని వివరించారు. ఈ ప్రాజెక్టులో 3.14 కిలోమీటర్ల మేర ట్విన్ ట్యూబ్ అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం జరగనుంది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**ఉత్తరప్రదేశ్‌లో భారీ జాతీయ రహదారి**

రాజధాని ప్రాజెక్టుతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంత అభివృద్ధికి కూడా కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. కాన్పూర్-కబ్రాయ్ జాతీయ రహదారి అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.7,145 కోట్ల వ్యయంతో కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రహదారి పూర్తయితే బుందేల్‌ఖండ్ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

**రైల్వే రంగానికి భారీ ఊతం**

దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మరో భారీ నిర్ణయం తీసుకుంది. 57 కీలక రైల్వే ప్రాజెక్టులకు సుమారు రూ.2.60 లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త రైల్వే మార్గాలు, సామర్థ్య విస్తరణ, సరుకు రవాణా మెరుగుదల, ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధి వంటి అంశాలపై ఈ నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు.

**మెట్రో ప్రాజెక్టులకు ప్రాధాన్యం**

పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని దేశంలోని ప్రధాన నగరాల్లో 12 కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు సుమారు రూ.1.50 లక్షల కోట్ల వ్యయంతో కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పట్టణ రవాణా వ్యవస్థను మరింత వేగవంతంగా, కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే ఈ నిర్ణయం లక్ష్యమని తెలిపారు.

**ఓడరేవులు, నౌకాయాన రంగానికి భారీ పెట్టుబడులు**

దేశ సముద్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఓడరేవుల ఆధునీకరణ, షిప్ రిపేర్ సదుపాయాల అభివృద్ధి, నౌకాయాన రంగ సంస్కరణల కోసం సుమారు రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్య సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సముద్ర రవాణాను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యంగా ఈ ప్రణాళికలు అమలుకానున్నాయి.

**ఉడాన్ పథకం విస్తరణ**

ప్రాంతీయ విమానయానాన్ని మరింత విస్తరించేందుకు కేంద్రం ఉడాన్ పథకాన్ని కూడా మరింత విస్తృత స్థాయిలో అమలు చేయాలని నిర్ణయించింది. రూ.37 వేల కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని విస్తరించడంతో పాటు దేశవ్యాప్తంగా మరో ఐదు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. చిన్న, మధ్యతరహా నగరాలకు విమాన సౌకర్యాలను మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కేంద్రం వెల్లడించింది.

**మౌలిక వసతులపై కేంద్రం దూకుడు**

రోడ్లు, రైల్వేలు, మెట్రోలు, విమానయానం, ఓడరేవులు వంటి అన్ని రంగాల్లో సమగ్ర మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు విస్తరించి, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.



## కేసీఆర్ గొప్పగా పాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారు?

**: మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, మహా :** కేసీఆర్ గొప్పగా పరిపాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని ఆయన అప్పుల పాల్జేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలో జూపల్లి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ చేసిన అప్పులపై శాసనసభలో లెక్కలతో సహా రుజువు చేశామన్నారు. రాష్ట్ర ప్రజల జేబులకు చిల్లు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న అప్పు ఎవరు కడతారని జూపల్లి ప్రశ్నించారు. ఇదే అంశాన్ని శాసన సభలో అడిగితే ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పలేదన్నారు.

# విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

- **భగ్నం చేసిన ఇంటెలిజెన్స్**
- **కుట్ర వెనుక డీఎంకే నేతలు**



**చెన్నై, మహా :** తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్ర జరిగింది. దీనిని తాము భగ్నం చేసినట్లు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం పేర్కొంది. రెండు నెలల్లోనే ప్రభుత్వాన్ని పడగొట్టడం కోసం ఒకేసారి 15 మంది టీవీకే ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించడం ఈ కుట్ర ముఖ్య ఉద్దేశం అని తెలుస్తోంది. ఓ టీవీకే ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై రంగంలోకి దిగిన అధికారులు దర్యాప్తు ప్రారంభించి, ఒక కన్సల్టెన్సీ సంస్థ ఉద్యోగిని తిరుచ్చిలో, మరో ఇద్దరిని చెన్నైలో అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరికి డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ, అతడి సోదరుడితో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ కుట్ర, దీని వెనుక ఉన్న విస్తృత నెట్‌వర్క్‌పై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఉత్తంగరై నియోజకవర్గ టీవీకే ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్, టీవీకే నేత జేసీడీ ప్రభాకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వడం కోసం ఐపీడీఎస్ అనే కన్సల్టెన్సీకి చెందిన ఓ వ్యక్తి తనకు రూ. 35 కోట్ల ఆఫర్ చేశాడని ఆయన ఆరోపించారు. ఆ తర్వాత తనను భయపెట్టి, ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని హెచ్చరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో ఇంటిలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగి గుట్టును రట్టు చేశాయి. ఈ కుట్రపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సెంథిల్ బాలాజీతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తులు, అలాగే కరూర్ గ్యాంగ్ వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారని ఆరోపించారు. ఎంకే స్టాలిన్, ఉదయనిధి ఆదేశాల మేరకు సెంథిల్ బాలాజీ వంటి కీలక డీఎంకే నేతలు తమ ఎమ్మెల్యేలను సంప్రదిస్తున్నారని తెలిపారు. వాళ్లు రూ. 1050 కోట్ల వరకు ఆఫర్ చేస్తున్నారని, వారు సంప్రదించని ఎమ్మెల్యే ఒక్కరు కూడా లేరని ఆయన పేర్కొన్నారు. అలాగే తమ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి డీఎంకే, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి కే పళనిస్వామి పరస్పరం చేతులు కలిపారని కూడా మంత్రి ఆరోపించారు.

# ఆదాయ లీకేజీలకు అడ్డుకట్ట



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలను చేరుకునే దిశగా ఆదాయ సమీకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదాయ లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక 'చేజింగ్ సెల్'ను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

ఈ సందర్భంగా ఆదాయ పెంపు, వనరుల సమీకరణ తదితర అంశాలపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ సంస్థలు ఆదాయ సమీకరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలలో ఎక్కడా ఎలాంటి లీకేజీలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఆదాయ పెంపు, నిధుల సమీకరణ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులకు తేల్చిచెప్పారు.

ప్రభుత్వ లక్ష్యాలను అనుకున్న స్థాయిలో సాధించాలంటే ఆయా శాఖల వారీగా పనితీరును, సామర్థ్యాన్ని మరింతగా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ఇతర అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేందుకు అనుగుణంగా శాఖల వారీగా బడ్జెట్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్ కేవలం ఊహాజనితంగా ఉండకూడదని, వాస్తవిక పరిస్థితుల ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. వాస్తవ అంచనాలతో ముందుకెళ్లినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. లక్ష్యాల సాధనలో ఆయా శాఖలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని ఆయన ఈ సందర్భంగా అధికారులకు భరోసా కల్పించారు.




# ఉపాధీ దూరం చేసే వీబీజీ రామ్ జీ ని రద్దుచేయాలి

- **ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన**

**కారేపల్లి, మహా :** పేదలకు ఉపాధిని దూరం చేసే వీబీజీ రామ్ జీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం, ఎర్రబోడు, మాణిక్యారం, విశ్వనాధపల్లి, గాంధీనగర్, గాదెపాడు, చీమలపాడు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట అందోళన చేపట్టారు. అంక్షలు లేకుండా పేదలకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టం, నాల్గు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మహత్మగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీని రద్దు చేసి పీవీజీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. వీబీజీ రాంజీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనటం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకవచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రైతు భరోసా ఎగవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ని ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ కు మంగళం పాడే పరిస్థితిని తీసుకరానుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుపై పోరాటాలే శరణ్యమన్నారు. పోరాటాలతోనే పాలకుల దిగివచ్చి పేదలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్ష, కార్యదర్శులు కేసగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షకార్యదర్శులు శనగ రాంబాబు, కేలోతు రవి, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు పండగ కొండయ్య, ఈసం సలీం, ఎండి ఇస్మాయిల్, రేగళ్ల మంగయ్య, షేక్ సైదులు, కుర్సం శ్రీను, గంగాధరణి ఉపేంద్ర చారి, చల్లా మల్లమ్మ, కరపటి లక్ష్మయ్య, సురభి సీత, ఎర్రిపోతు ముత్యాలు, రాచర్ల రణధీర్, భూక్య లక్ష్మణ్, నరసింహారావు, అబ్రహం, సారయ్య, కిరణ్, మున్న, జగదీష్, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# చొరవ చూపి.. తాగునీటి సమస్య పరిష్కరించి

**గాదిగూడ మండలంలో ఆర్వో ప్లాంట్**
**పోలీస్ శాఖా ఆధ్వర్యంలో ఏర్పాటు**

ఆదిలాబాద్ మహా: గాదిగూడ మండలం పరస్వాడ(కె) గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక చొరవ చూపారు. ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి బుధవారం గ్రామ ప్రజల సమక్షంలో ప్రారంభించారు. గతంలో తీవ్రమైన క్లోరినేషన్ సమస్య కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న తమ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు గ్రామ ప్రజలు జిల్లా పోలీస్ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆరో ప్లాంట్ ను గ్రామ పెద్దల తో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తదుపరి మహిళలు నీటిని తీసుకొని మొదటగా గ్రామంలో ఉన్న శివాలయంలో అభిషేకం నిర్వహించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ ఆర్వో ప్లాంట్‌ను బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలని, ప్రతి కుటుంబం శుద్ధి చేసిన తాగునీటినే వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామ ప్రజలు, యువత గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి సాగు, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. గంజాయి సాగు చేసిన వారి పేర్లను ప్రభుత్వానికి నివేదించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిపివేయాలని సిఫార్సు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. యువత చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో రాణించి కుటుంబంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించాలని కోరారు. రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. మూఢనమ్మకాలు, బాబాలు, ఫకీర్ల మాయమాటలను నమ్మకుండా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వ లేదా ప్రైవేట్ అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసరంగా టాబ్లెట్లను మందులను వాడటం వల్ల కిడ్నీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున వాటి వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, నార్నూర్ సీఐ బి. అంజమ్మ, గాదిగూడ ఎస్ఐ రమ్య, గ్రామ సర్పంచ్ మర్సకోల లక్ష్మణ్, సార్ మేడి దౌలత్ రావు, గ్రామ పెద్ద సిడం మారు, గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అన్నా అక్కల పాఠలు అభ్యున్నతికి అడుగులు

- **మెంటార్ షిప్ ప్రోగ్రాంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మేలు..**

**రాజేంద్రనగర్ మహా ;** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ ) డిజిటల్ విద్యా అందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్న అక్క మెంటార్ షిప్ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. జూలై నుంచి సెప్టెంబర్ ఐదో తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు కానుంది. శంషాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో తెలంగాణ విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న అక్క మెంటార్ షిప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం శంషాబాద్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాతాంరాయి లో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన విద్యార్థులకు ఏఐ డిజిటల్ టూల్స్ కోడింగ్ పై ఇంటర్నేషనల్ షిప్(మెంటార్లుగా ) శిక్షణ ఇస్తున్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. సీనియర్ విద్యార్థులు కావడంతో అన్నా అక్క అనే భావన ఉంటుందన్నారు. అనుమానాలు ఉన్న నిర్భయంగా నివృత్తి చేసుకుంటారు.చిన్నప్పటినుండి ప్రైవేట్ విద్యాసంస్థల్లో కంప్యూటర్ పై అవగాహన కల్పిస్తున్నారు. అన్న అక్క కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుంది. విద్యార్థులు సొంతంగా ఏఐ తో పాఠాలు నేర్చుకోవచ్చున్నారు.



# జూనియర్ కళాశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

**కారేపల్లి, మహా:** కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైని పరాస్ కుమార్ ఐఏఎస్ బుధవారం సందర్శించారు. కళాశాల తరగతి గదులను పరిశీలించి అధ్యాపకులతో మాట్లాడారు కళాశాలలో ఫలితాలు, ప్రవేశాల గురించి కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి ని అడ్మిషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఫలితాలలో ఖమ్మం జిల్లాలో 23 కళాశాలలో మొదటి స్థానంలో కారేపల్లి రావటం, ఇంటర్ మొదటి సంవత్సరంలో 180 అడ్మిషన్లు కావటంతో ట్రైనీ కలెక్టర్ అధ్యాపకులకు అభినందించారు. అన్ని తరగతులు సందర్శించి విద్యార్థుల హాజరు శాతం తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల తరగతి గదులు, ఇతర గదులు మరమ్మతులపై ఆరా తీశారు. ట్రైనీ కలెక్టర్ వెంట డిప్యూటి తహసీల్దర్ కృష్ణయ్య, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.





# తెరుచుకున్న గంగారంతండా పాఠశాల

- **బడి కోసం చొరవ చూపిన సర్పంచ్**

**కారేపల్లి, మహా:** పిల్లలు లేక మూతపడిన ప్రభుత్వపాఠశాల సర్పంచ్ చొరవతో కారేపల్లి మండలం గంగారంతండా మళ్ళి తెరుచుకుంది. తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించాలని ఆకాంక్షతో గంగారంతండా గ్రామస్తులు దూరమైన ఆర్థిక భారమైన 10 కిలోమీటర్ల దూరంలోని కారేపల్లిలో ప్రయివేటు పాఠశాలకు పంపుతున్నారు. విద్యావంతుడైన నూనవత్ కిరణ్ కుమార్ సర్పంచ్ కావటంతో తమ ఊరిలో మూత పడిన ప్రభుత్వ బడిని తెరిపించాలని పట్టుదలతో గ్రామస్తులతో మాట్లాడారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత నూనావత్ అశ్విని పుట్టిన ఊరిలో ప్రభుత్వ బడి ఉండాలనే దృఢ సంకల్పంతో తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చటానికి తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్ ఒప్పించటంతోపాటు అధికారులతో మాట్లాడి ఐదేండ్ల క్రితం మూత బడిన పాఠశాలనుతిరిగి తెరిపించారు. దీంతో బుధవారం ప్రభుత్వ బడిని అధికారులు తెరిచారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటు ఆహారం, దుస్తులు, పుస్తకాలు అందించటం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ప్రభుత్వ బడులపై నమ్మకం ఉంచి పిల్లలను చేర్పించాలని కోరారు.

# భోగాపురం... ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మహత్తర ఘట్టం















ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమనాన్ని మార్చే మహత్తర ఘట్టానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. దాదాపు 3 దశాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న కల ఇప్పుడు ప్రపంచస్థాయి మౌలిక వసతులతో సాకారమైంది. రాష్ట్రంలో తొలి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా భోగాపురం జూలైలో ప్రారంభానికి సిద్ధమవుతోంది. వేల కోట్ల రూపాయల పెట్టుబడి... అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం... అంతర్జాతీయ ప్రమాణాల నిర్మాణం... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ప్రణాళిక... ఇవన్నీ కలిసి భోగాపురాన్ని సాధారణ విమానాశ్రయంగా కాకుండా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి కొత్త కేంద్రంగా నిలబెడుతున్నాయి. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే శక్తి ఈ ప్రాజెక్టులో దాగి ఉంది. పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం, ఎగుమతులు, ఉపాధి... ప్రతి రంగానికీ ఇది కొత్త అధ్యాయాన్ని తెరవబోతోంది. భోగాపురం విమానాశ్రయ ఆలోచనకు నాంది పడింది 1997లో. విశాఖపట్నం భవిష్యత్ విస్తరణను దృష్టిలో ఉంచుకుని కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం అవసరాన్ని అప్పుడే గుర్తించారు. ఆ తర్వాత కేంద్ర అనుమతులు, సాంకేతిక పరిశీలనలు, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, న్యాయపరమైన ప్రక్రియలు... ఇలా ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజెక్టు ముందుకు సాగింది. దాదాపు మూడు దశాబ్దాల ప్రయాణం తర్వాత భోగాపురం ఇప్పుడు వాస్తవ రూపంలో నిలబడింది. 2019 ఫిబ్రవరి 14న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ మార్పుతో ప్రాజెక్టు విధానంలో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ అభివృద్ధి ఆగలేదు. 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పునఃశంకుస్థాపన చేసి నిర్మాణాన్ని వేగవంతం చేశారు. అనంతరం జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం వేగంగా సాగి ఇప్పుడు తొలి దశ పూర్తయింది. రాజకీయాలు మారినా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టులు కొనసాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని భోగాపురం మరోసారి రుజువు చేసింది.

సుమారు 4592 కోట్ల రూపాయల వ్యయంతో తొలి దశ నిర్మాణం పూర్తయింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో జీఎంఆర్ సంస్థ ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసింది. భూముల సమీకరణ, రహదారుల అభివృద్ధి, విద్యుత్, నీటి వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా నిర్మాణ వ్యయం భరించకపోయినా అవసరమైన అన్ని విధానపరమైన అనుమతులు, నియంత్రణ సంస్థల క్లియరెన్సులు, విమానయాన అనుమతులు అందించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ విమానాశ్రయం భవిష్యత్ విస్తరణకు కూడా పూర్తిగా సిద్ధంగా ఉంది. భోగాపురం విమానాశ్రయంలో సుమారు మూడు దశాంశం లో ఎనిమిది కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. భారీ అంతర్జాతీయ ప్రయాణికుల విమానాలు, కార్గో విమానాలు సైతం సులభంగా దిగేలా రూపకల్పన చేశారు. ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు, అత్యాధునిక ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ, డిజిటల్ భద్రతా వ్యవస్థలు, శక్తి పొదుపు సాంకేతికతతో విమానాశ్రయం అత్యున్నత ప్రమాణాలను అందుకుంది. ఇటీవల నిర్వహించిన ధ్రువీకరణ విమాన పరీక్షలు విజయవంతం కావడంతో సాంకేతికంగా కూడా ఇది సిద్ధమైందని స్పష్టమైంది. విశాఖపట్నం ఇప్పటికే పారిశ్రామిక, నౌకాశ్రయ, ఐటీ కేంద్రంగా ఎదుగుతోంది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుంది. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పారిశ్రామిక పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్, ఔషధ తయారీ, ఆహార ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, గిడ్డంగులు, ఎగుమతి పరిశ్రమలు, కార్గో సేవలు మరింత విస్తరించనున్నాయి. అంతర్జాతీయ అనుసంధానం పెరగడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆకర్షితమయ్యే అవకాశాలు ఉన్నాయి.

అరకు అందాలు, బొర్రా గుహల విశిష్టత, భీమిలి సముద్రతీరం, రుషికొండ, యారాడ, బౌద్ధ వారసత్వ క్షేత్రాలు, తూర్పు కనుమల ప్రకృతి సంపద ప్రపంచ పర్యాటకులను మరింత ఆకర్షించనున్నాయి. అంతర్జాతీయ విమాన సౌకర్యం కారణంగా విదేశీ పర్యాటకుల రాక పెరిగితే హోటళ్లు, రిసార్టులు, టూరిజం సేవలు, స్థానిక వ్యాపారాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర పర్యాటక రంగానికి ఇది బంగారు యుగానికి నాంది పలికే ప్రాజెక్టుగా భావిస్తున్నారు. విమానాశ్రయం అంటే కేవలం విమానాల రాకపోకలు మాత్రమే కాదు. దాని చుట్టూ కొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుంది. విమానాశ్రయ నిర్వహణ, కార్గో, భద్రత, రవాణా, హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సముదాయాలు, లాజిస్టిక్స్, సేవారంగాల్లో వేలాది ప్రత్యక్ష ఉద్యోగాలు, లక్షలాది పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఉత్తరాంధ్ర యువతకు స్వస్థలంలోనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడనుంది. నిర్మాణ పనులు పూర్తికావడంతో పాటు ధ్రువీకరణ విమాన పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఇప్పుడు తుది భద్రతా, నియంత్రణ అనుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. జూలైలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. అధికారిక తేదీపై ప్రభుత్వం త్వరలో ప్రకటన చేయనుంది.

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక నిర్మాణం కాదు... ఒక దూరదృష్టి. ఇది కాంక్రీట్‌తో నిర్మించిన భవనం కాదు... ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై నిర్మించిన విశ్వాసం. ప్రపంచ పెట్టుబడులకు ఆహ్వానం పలికే ద్వారం. పరిశ్రమలకు కొత్త చిరునామా. యువత కలలకు రెక్కలు. రైతుల ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లకు మార్గం. ఉత్తరాంధ్రకు ఆర్థిక శక్తి. రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు. జూలైలో భోగాపురం నుంచి ఎగిరే తొలి విమానం కేవలం ప్రయాణాన్ని ప్రారంభించదు... అభివృద్ధి, అవకాశాలు, ఆత్మవిశ్వాసం, ప్రపంచ అనుసంధానంతో కూడిన కొత్త ఆంధ్రప్రదేశ్ యుగానికి శ్రీకారం చుడుతుంది. రాష్ట్ర అభివృద్ధి గాథలో ఈ విమానాశ్రయం స్వర్ణాక్షరాలతో లిఖించబడే మైలురాయిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

**- గడల నరసింహారావు,**
**సీనియర్ జర్నలిస్ట్**

# దాయాది గుండెల్లో 'సింధూర్'

భారతదేశ సార్వభౌమాధికారానికి, జాతీయ భద్రతకు సవాల్‌గా మారిన ఉగ్రవాద మూలాలను తుదముట్టించేందుకు ఢిల్లీ పీఠం అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే, దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు జీవనరేఖగా ఉన్న 'సింధూ జలాల ఒప్పందం' ) పై భారత్ తన పట్టును బిగించడం ప్రారంభించింది. ఈ పరిణామం ఇస్లామాబాద్ పాలకవర్గంలో పెను అలజడిని సృష్టిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సరిహద్దుల్లో ఉగ్రరక్తానికి, సింధు జలాల ప్రవాహానికి చుక్కెదురు కాక తప్పదనే సంకేతాలను భారత్ స్పష్టం చేయడంతో, దాయాది దేశం ఉక్కిరిబిక్కిరవుతోంది. యుద్ధానికైనా సిద్ధమంటూ పాక్ మంత్రులు చేస్తున్న ప్రేలాపనలు వారి నిస్సహాయతకు, అంతర్గత భయాందోళనలకు అద్దం పడుతున్నాయి. దేశ విభజన కేవలం భూభాగాన్నే కాదు, శతాబ్దాలుగా అఖండ భారతావనిని సస్యశ్యామలం చేసిన నదీ వ్యవస్థలను కూడా ముక్కలు చేసింది. సింధు నది ఎగువ భాగం భారతదేశంలోనూ, దిగువ భాగం పాకిస్థాన్‌లోనూ ఉండిపోయాయి. నదీ జలాల పంపిణీపై ఒక స్పష్టమైన అవగాహన కోసం నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాక్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్‌ల మధ్య 1960 సెప్టెంబరు 19న కరాచీలో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో 'సింధూ జలాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం నదీ వ్యవస్థను రెండుగా విభజించారు. తూర్పు నదులు (రావి, బియాస్, సట్లెజ్) వీటిపై పూర్తి హక్కులు భారతదేశానికి దక్కాయి. పశ్చిమ నదులు (సింధు, ఝేలం, చీనాబ్) వీటిపై హక్కులు పాకిస్థాన్‌కు కేటాయించారు. భౌగోళికంగా ఈ నదులన్నీ భారత్ నుంచే ప్రవహిస్తున్నప్పటికీ, ఉదారత్వంతో మొత్తం జలాల్లో దాదాపు *80 శాతం వాటాను* భారత్ పాకిస్థాన్‌కే ధారపోసింది. ఇది అంతర్జాతీయ దౌత్య చరిత్రలోనే అత్యంత ఉదారమైన, ఏకపక్ష (పాక్‌కు అనుకూలమైన) ఒప్పందంగా నిలిచిపోయింది.

గడిచిన ఆరు దశాబ్దాల్లో భారత్‌పాక్ మధ్య మూడు పెద్ద యుద్ధాలు జరిగాయి, కార్గిల్ ఘర్షణ జరిగింది, నిరంతరం సరిహద్దుల్లో ఉగ్రవాద చొరబాట్లు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ భారత్ ఈ జల ఒప్పందాన్ని ఎన్నడూ ఉల్లంఘించలేదు. కానీ, భారతదేశపు ఈ సంయమనాన్ని, శాంతి కాముకతను పాకిస్థాన్ తన బలహీనతగా పొరబడింది. ఒకవైపు భారత్ ఇచ్చిన నీటితో దాహం తీర్చుకుంటూ, తమ పంజాబ్, సింధ్ ప్రాంతాల వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేసుకుంటూనే... మరోవైపు అదే భారత్‌ను ఉగ్రవాదంతో రక్తోడు చేయాలని చూడటం దాయాది నైజం. పహల్గాం ఉగ్రదాడితో భారత ఓరిమి నశించింది. "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు" అన్న కఠోర సత్యాన్ని భారత్ ఇప్పుడు ఆచరణలో చూపిస్తోంది.

**2028 డెడ్‌లైన్: దాయాదికి చుక్కెదురు**

2028 జూన్ నాటికి పాకిస్థాన్‌కు వెళ్లే సింధు నదీ జలాల ప్రవాహాన్ని పూర్తిగా నియంత్రించే వ్యూహాన్ని భారత జలశక్తి శాఖ ప్రకటించడంతో పాక్ పాలకులు సంయమనం కోల్పోతున్నారు. పశ్చిమ నదులపై భారత్‌కు కేవలం విద్యుత్ ప్రాజెక్టులు , పరిమిత నీటి నిల్వ హక్కులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటివరకు భారత్ ఆ హక్కులను కూడా పూర్తిస్థాయిలో వాడుకోలేదు. ఇప్పుడు షాపూర్ కంది ప్రాజెక్ట్, ఉజ్ డ్యామ్, కిషన్‌గంగా, రాట్లే వంటి ప్రాజెక్టుల ద్వారా తన వాటా నీటిని చుక్క కూడా వదలకుండా వాడుకోవడానికి భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. దీనివల్ల పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోనుంది. పాక్ మంత్రులు ముసాదిక్ మాలిక్, అట్టావుల్లా తరార్ చేస్తున్న వ్యాఖ్యలు వారి వ్యూహాత్మక ఓటమిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాల వెనుక దాక్కోవాలని చూస్తూనే, మరోవైపు రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ద్వారా సైనిక చర్యల గురించిన కవ్వింపులకు తెరలేపడం హాస్యాస్పదం. ఆర్థికంగా దివాళా తీసి, అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు భారత్‌తో సైనిక ఘర్షణ అనేది ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది.

భారతదేశ విదేశాంగ, రక్షణ విధానాల్లో స్పష్టమైన మరియు దూకుడుతో కూడిన మార్పు కనిపిస్తోంది. గతంలో దౌత్యపరమైన నిరసనలకే పరిమితమైన భారత్, ఇప్పుడు పాకిస్థాన్ యొక్క మనుగడ ఆధారపడి ఉన్న ఆర్థిక, జీవన మూలాలపై దెబ్బకొట్టడానికి వెనుకాడటం లేదు. కాశ్మీర్ లోయలో అమాయకుల రక్తాన్ని చిందిస్తున్నంత కాలం, ఆ కాశ్మీర్ గుండా ప్రవహించే నదుల జలాలపై పాకిస్థాన్‌కు ఎలాంటి నైతిక హక్కు ఉండదని భారత్ స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించడం ఎంత ముఖ్యమో, జాతీయ భద్రతను కాపాడుకోవడం అంతకంటే అత్యంత ప్రాధాన్యమైనది. పాకిస్థాన్ ఇప్పటికైనా తన ఉగ్రవాద అనుకూల విధానాలను పక్కనబెట్టి, శాంతి మార్గంలోకి రాకపోతే... సింధు నది పాకిస్థాన్‌కు జీవధార కావడం పక్కన పెడితే, దాని ఎడారితనం మరింత తీవ్రరూపం దాల్చడం ఖాయం. ఉగ్రవాదానికి ఊతమిస్తూ జల హక్కుల గురించి మాట్లాడటం పాక్ పాలకుల ద్వంద్వ నీతికి పరాకాష్ట. ఢిల్లీ పీఠం తీసుకున్న ఈ జల వ్యూహం దాయాది గుండెల్లో 'సింధూర్' పుట్టిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



## తక్కువ బడ్జెట్‌లో స్వర్గానుభూతి..

# బెస్ట్ టూర్ ప్లాన్!

వేసవి ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందాలని, ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా కొన్ని రోజులు గడపాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే ప్రముఖ హిల్ స్టేషన్లు పర్యాటకులతో కిక్కిరిసిపోవడం, హోటళ్ల ధరలు అమాంతం పెరగడం వల్ల సాధారణ కుటుంబాలకు విహారయాత్ర భారంగా మారుతోంది. అలాంటి పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో అద్భుతమైన ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే వారికి దేశంలోనే కొన్ని అరుదైన హిల్ స్టేషన్లు మంచి ఎంపికగా నిలుస్తున్నాయి.అందమైన పచ్చని లోయలు, మంచుతో కప్పుకున్న పర్వతాలు, చల్లని వాతావరణం, నిశ్శబ్ద ప్రకృతి... విదేశాల్లో మాత్రమే లభిస్తాయని అనుకునే అనుభూతిని భారతదేశంలోని ఈ ప్రాంతాలు అందిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ విహారయాత్రలు, హనీమూన్ ట్రిప్స్, ఫ్రెండ్స్ ట్రెక్కింగ్ టూర్లకు ఈ ప్రాంతాలు అనువైనవి. తక్కువ బడ్జెట్‌తో ప్రయాణం పూర్తి చేసుకోవడంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలను సొంతం చేసుకోవచ్చు.



**1. తీర్థన్ లోయ – హిమాచల్ ప్రదేశ్**

ప్రకృతి ప్రేమికులకు తీర్థన్ లోయ ఓ స్వర్గధామం. పారదర్శకంగా ప్రవహించే తీర్థన్ నది, దట్టమైన అడవులు, మంచు పర్వతాల మధ్య ప్రశాంతమైన వాతావరణం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ట్రెక్కింగ్, క్యాంపింగ్, ఆంగ్లింగ్ (చేపలు పట్టడం) ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. హోమ్ స్టేలు, చిన్న రిసార్టులు అందుబాటు ధరల్లో లభించడం మరో ప్రత్యేకత.



**2. చోప్టా – ఉత్తరాఖండ్**

భారతదేశపు 'మినీ స్విట్జర్లాండ్'గా పేరొందిన చోప్టా పచ్చని గడ్డి మైదానాలు, మంచు పర్వతాలతో స్విట్జర్లాండ్‌ను తలపిస్తుంది. ఇక్కడి నుంచి ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న శివాలయాల్లో ఒకటైన తుంగనాథ్ ఆలయానికి ట్రెక్కింగ్ చేయవచ్చు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో కనిపించే హిమాలయాల అందాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి.

3. లాన్స్‌డౌన్ - ఉత్తరాఖండ్


రద్దీకి దూరంగా ప్రశాంతమైన వాతావరణాన్ని కోరుకునే వారికి లాన్స్‌డౌన్ అత్యుత్తమ ఎంపిక. పైన్ అడవులు, స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన వీధులు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. టిప్ అండ్ టాప్ వ్యూ పాయింట్ నుంచి హిమాలయ పర్వత శ్రేణుల అద్భుత దృశ్యాలను వీక్షించవచ్చు. కుటుంబాలతో విహారయాత్రకు ఇది అనువైన ప్రదేశంగా గుర్తింపు పొందింది.

**4. జీరో వ్యాలీ – అరుణాచల్ ప్రదేశ్**

ప్రకృతి అందాలతో పాటు గిరిజన సంస్కృతిని దగ్గరగా అనుభవించాలనుకునే వారికి జీరో వ్యాలీ బెస్ట్ డెస్టినేషన్. విశాలమైన వరి పొలాలు, పచ్చని కొండలు, స్వచ్ఛమైన వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. నగర జీవితంలోని ఒత్తిడికి దూరంగా ప్రశాంతంగా గడపాలనుకునే వారికి ఇది చక్కని ఎంపిక.

**5. యెర్కాడ్ – తమిళనాడు**

దక్షిణ భారతదేశంలో ఇంకా పూర్తిస్థాయిలో ప్రాచుర్యం పొందని అందమైన హిల్ స్టేషన్లలో యెర్కాడ్ ఒకటి. కాఫీ తోటలు, సిల్వర్ ఓక్ అడవులు, సరస్సులు, వ్యూ పాయింట్లు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. వసతి, భోజనం, ప్రయాణ ఖర్చులు కూడా అందుబాటులో ఉండటంతో తక్కువ బడ్జెట్‌లో కుటుంబంతో కలిసి విహారయాత్ర చేయడానికి ఇది ఉత్తమ ఎంపికగా నిలుస్తోంది.





# పాలకుర్తిలో వైభవంగా బీరన్న బోనాలు

**రామగుండం, జూలై 01 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలో బుధవారం బీరన్న బోనాల పండుగను యాదవ కులస్తులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.ఉదయం నుంచే యాదవ ఆడపడుచులు సాంప్రదాయబద్ధంగా తలలపై బోనాలను ఎత్తుకుని తరలివెళ్లారు. బీరన్న స్వామికి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు యాదవ ఆడపడుచులు మాట్లాడుతూ. ఈ ఏడాది వానలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి యాదవ సంఘం అధ్యక్షులు ధారవేణి సతీష్, ప్రశాంత్, మల్లయ్య,మల్లేష్, రాజయ్య , ఓదెలు, నరసయ్య, రాజు, తదితరులు యాదవ కులస్తులు మహిళలు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో కోతుల బీభత్సం

- మహిళలపై కోతుల గుంపు దాడి.. తీవ్ర గాయాలు
- రక్తస్రావంతో బాధితురాలిని 108లో ఆసుపత్రికి తరలింపు
- కోతుల బెడదపై తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**రామగుండం, జూలై 01 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలో కోతుల గుంపులు స్వైరవిహారం చేస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధుల్లో నడవడానికైనా, ఇళ్ల నుంచి బయటకు రావడానికైనా వృద్ధులు, మహిళలు, చిన్నారులు జంకుతున్నారు. బుధవారం ఉదయం పాలకుర్తి గ్రామానికి చెందిన గంగుల రాజమ్మ (58)పై కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. కోతులు చుట్టుముట్టి కరవడంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు కేకలు వేస్తూ కోతులను తరిమికొట్టారు. అనంతరం తీవ్ర రక్తస్రావంతో ఉన్న రాజమ్మను 108 అంబులెన్స్‌లో సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. కోతుల బెడదపై గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమలతో పాటు సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు కోతులను పట్టుకుని సురక్షిత అటవీ ప్రాంతాల్లో వదిలేలా తక్షణ చర్యలు చేపట్టి పాలకుర్తి ప్రజలను వానర భయం నుంచి కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# సింగరేణి అధికారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బృందం డిమాండ్
- దీక్షా శిబిరాన్ని దర్శించి సంఘీభావం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలనిభారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సింగరేణి పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివ కుమార్ డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరుతూ సింగరేణి అధికారులు సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన దీక్ష శిబిరాన్ని బుధవారం మద్దెల శివకుమార్ బృందం పరామర్శించి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ప్రధాన సమస్యలైన పర్ఫామెన్స్ రిలేటెడ్ పే(పి అర్ పి), పే అప్ గ్రేడేషన్ సమస్యతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారుల సమస్యల పరిష్కార విషయంలోసింగరేణి యాజమాన్యం చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. సింగరేణి సంస్థలో అధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగడం దీక్షలు చేయడం ఇది మొట్టమొదటిసారని ఇది చాలా శుభ పరిణామమని సింగరేణి చరిత్రలోనే ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. దీక్ష చేస్తున్న అధికారులను అభినందిస్తూ సింగరేణి యాజమాన్యం దిగివచ్చి పైన పేర్కొన్న న్యాయపరమైనటువంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఇది ప్రజా ఉద్యమంగా మారి ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని భవిష్యత్తులో ఇది సింగరేణి సంస్థ మనుగడకే ఎంతో ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్ ల కనీస హక్కును కూడా పొందనీయకుండా చేయడం దారుణం అన్నారు. సంవత్సరాలు గడిచిన రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా ఉండడం ఈ పాలకుల అసమర్థతను తెలియజేస్తున్నదని అన్నారు. ఏ ఉద్యోగస్తుల కైనా రావలసిన కనీస హక్కులను బెనిఫిట్స్ను అందజేయకుండా ప్రభుత్వ ఖజానాను పూర్తిగా ఓటు బ్యాంకు రాజకీయాలకు మళ్లించడం ఎంతో దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 80 మంది రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావలసిన బెనిఫిట్స్ సుదీర్ఘ కాలంగా అందక ఆత్మహత్యలు చేసుకున్న కూడా ఈ ప్రభుత్వాలకు ఏమాత్రం చలనం కలగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కళ్ళు తెరిచి ఉద్యోగస్తుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిచో తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని ఆచార్య డాక్టర్ మద్దెల హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈ దీక్షలో అధికారులు సునీల్ కుమార్, విజయ్ ప్రసాద్, హర్షద్, విజయకుమార్, భువనేశ్వరి, భావన, కోట శ్రీనివాసరావు కూర్చున్నారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన వారిలో ఆచార్య డాక్టర్ మద్దెలతోపాటు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, జిల్లా నాయకులు సాయి కుమార్, కేదాసి కిరణ్, అఫ్రయిమ్ చింటూ తదితరులు ఉన్నారు.

# నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి కూలీ మృతి

- ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వలస కూలి
- న్యాయం కోసం మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

**కుషాయిగూడ, మహా :** నిర్మాణంలో ఉన్న భవనంపై పని చేస్తుండగా ఓ కూలీ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రణస్థల కృష్ణారావు (40) తన సోదరుడు శంకర్‌రావుతో కలిసి గోవా కర్రలు (స్కాఫోల్డింగ్) కట్టే పనులు చేస్తుంటాడు. బుధవారం కైలాసగిరి అంబేద్కర్ విగ్రహం సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంలో పనికి వెళ్లారు. ఉదయం రెండో అంతస్తులో గోవా కర్రలు ఏర్పాటు చేస్తుండగా తడి కర్రలు విద్యుత్ తీగలకు తగలడంతో కరెంట్ ప్రవహించింది. ప్రమాదాన్ని గుర్తించిన శంకర్‌రావు పక్కనే ఉన్న భవనంపైకి దూకి ప్రాణాలు దక్కించుకోగా, కృష్ణారావు రెండో అంతస్తు నుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భవన యజమాని తగిన భద్రతా చర్యలు తీసుకోకుండా పనులు చేయించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి సోదరుడు శంకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుషాయిగూడ పోలీసులు తెలిపారు.

# పేదలకు ఇండ్లు ఇచ్చేవరకు ఉద్యమం ఆగదు

- ఇండ్లు కూల్చివేత చర్యలను పేదలపక్షాన ప్రతిఘటిస్తాం
- కొత్తగూడెం పాల్వంచలో స్థలాలు క్రమబద్ధీకరించి హక్కు కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఇండ్లు, ఇండ్లస్థలాలకోసం వామపక్షాలు చేపట్టిన కలెక్టరేట్ ధర్నా సక్సెస్ భారీగా తరలివచ్చిన జనం




**భద్రాద్రి బ్యూరో, మహా**:ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు ఇచ్చేవరకు ఉద్యమం ఆగదని పేదలకు గూడు కల్పించేవరకు పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ, మాస్ లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, ఇండ్లు లేని వేలాది మంది పేదలు భారీ సంఖ్యలో కలెక్టరేట్ కు తరలివచ్చి నాలుగుగంటలపాటు ఉధృతంగా ధర్నా కొనసాగించారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని ప్రజనుద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు మంజూరు చేసేవరకు వామపక్షాల ఆధ్వర్యంలో సాగే ఈ ప్రజా ఉద్యమం ఎంతమాత్రం ఆగదని స్పష్టం చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలో జీవో నెంబర్ 76ను తక్షణమే పూర్తి స్థాయిలో అమలు చేసి అర్హులైన నిరుపేదలందరికీ పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాల్వంచ పరిధిలోని జీవో నెంబర్లు 444, 999, 817, 727, 410 పరిధిలో దశాబ్దాలుగా నమ్ముకుని ఉన్న స్థలాలను తక్షణమే రెగ్యులరైజ్ చేసి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు.

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు**

ఎం.సాయిబాబు మాట్లాడుతూ పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేత చర్యలను తక్షణమే మానుకోవాలని ప్రభుత్వ నిరంకుశ కూల్చివేతలను పేద ప్రజలందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణాలు గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇండ్ల స్థలాలను తక్షణమే క్రమబద్ధీకరించి వారికి చట్టబద్ధమైన హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే ఇంటి నెంబర్లు జారీ చేయాలని తాగునీరు విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులూ గౌని నాగేశ్వరరావు, మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని లేనిపక్షంలో కలెక్టరేట్లను ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, మున్నా లక్ష్మీ కుమారి, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, రాహుల్, ఫహీమ్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, ఎం .సతీష్, కుంజా కృష్ణ, పెద్దబోయిన సతీష్, ప్రభాకర్, భాస్కర్, వీరభద్రం, శివ, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా హనుమకొండ జిల్లా కలెక్టర్

- గణిత శాస్త్రం బోధిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన కలెక్టర్
- అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మొక్క నాటిన కలెక్టర్



**హనుమకొండ మహా;** ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలవాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్ర పాఠ్యాంశాన్ని ఎంతో చక్కగా బోధించి అందరినీ ఆశ్చర్య పరిచింది. ఒక చేత్తో గణిత పాఠ్యపుస్తకాన్ని కలెక్టర్ పట్టుకొని మరో చేతితో చాక్ పీస్ చేత పట్టి బ్లాక్‌బోర్డు పై స్వయంగా లెక్కలు రాసి విద్యార్థులతో గణితం లెక్కను సాధింపజేయడంతో పాటు వారి అవగాహన, ప్రతిభ, నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాల సందర్శనకు వచ్చి తరగతి గదులు పరిశీలిస్తూ వచ్చిన కలెక్టర్ ఐదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా బోధించడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. కలెక్టర్ ఉపాధ్యాయురాలుగా మారి పాఠశాల విద్యార్థులకు విద్యా బోధన సాగించడం పాఠశాల ఉపాధ్యాయులకు సైతం స్ఫూర్తి నిచ్చింది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. ఆనందంతో మాట్లాడిన కలెక్టర్ విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించి ప్రభుత్వ పాఠశాలల పై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలలోని తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం పంపిణీని పరిశీలించి లబ్ధిదారులకు అందజేశారు. ప్రీస్కూల్ విద్యా బోధనను పరిశీలించి చిన్నారుల్లో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. తదనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డ్, గ్రామపంచాయతీ కార్యాలయంలోని నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ సమర్ధ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంభూపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కార్డు ఉంటే రూ.3 లక్షల లోన్ పై క్లారిటీ!

**మహా వరంగల్ పోచమ్మ మైదాన్ ;**ప్రభుత్వం ఉచితంగా లోన్లు ఇస్తుందని, ఆధార్ వివరాలు ఇస్తే రూ.3 లక్షల వరకు లోన్ ఇస్తామని ప్రచార మాధ్యమాలలో వస్తున్న ప్రకటనలు పూర్తిగా నకిలీవని కేంద్రం ప్రజలను అప్రమత్తం చేసింది. ప్రధానమంత్రి లోన్ స్కీమ్ పేరుతో వస్తున్న ఈ ఆఫర్‌లను నమ్మవద్దని హెచ్చరించింది. ఈ నకిలీ ప్రకటనలలోని లింక్‌లను క్లిక్ చేస్తే, మోసగాళ్లు ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో డబ్బులు తీసుకుని, ఆధార్, ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించి, ఓటిపి ద్వారా ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేస్తున్నారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలను ఎవరికీ పంచుకోవద్దని సూచించింది.



# లింకులు క్లిక్ చేస్తే అకౌంట్లు ఖాళీ

**వరంగల్‌హనుమకొండ క్రైం:** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, స్థానిక ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఓటీపీ, యూపీఐ పిన్ లేదా పాస్‌వర్డ్‌లు అడగరని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదును తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా చైతన్యపరచాలని ఆయన పిలుపునిచ్చారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి ఐ.పి.ఎస్
- నూతన వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరణ



**వరంగల్ క్రైం బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి తెలిపారు.బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆమె, ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు నూతన కమిషనర్ కు వందనం సమర్పించారు.అనంతరం కమీషనర్ కార్యాలయంలో వెళ్తున్న మాజీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుంచి నూతన పోలీస్ కమిషనర్ గా ఎన్. శ్వేతా రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, నోట్ బుక్ లను సీపీకి అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్ ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.



## లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

**భద్రాద్రి బ్యూరో, మహా:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి జెబిసిసిఐ-12వ వేతన ఒప్పంద చర్చలను వెంటనే ప్రారంభించాలనిఐ ఎన్ టి యూసి సెక్రటరీ జనరల్ డాక్టర్ బి.జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని అలాగే 12వ వేతన ఒప్పంద చర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో భారీ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి కార్మికుల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి న్యాయమైన వేతన సవరణను అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సింగరేణి అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులతో పాటు ఏఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రైతులా మారిన ఎమ్మెల్యే వేముల వీరేశం

**యాదాద్రిభువనగిరి జులై 1 మహా న్యూస్** ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రైతులా వరి మొలక అలుకుతూ రైతే దేశానికి వెన్నెముక అంటూ రైతు అంటే ఎంతో ఇష్టమని ప్రజాసేవతోపాటు వ్యవసాయం మీద కూడా మక్కువ చూపిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం ను ప్రజలు ప్రజా నాయకుడు అంటే ఇలా ఉండాలని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు



## వైద్యుడు దేవుడితో సమానం

**మున్సిపల్ చైర్మన్ బిజానబాలమణి భాస్కర్**

**యాదాద్రి భువనగిరి జులై 1 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లను బుధవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, పలువురు కౌన్సిలర్లు స్థానిక డాక్టర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు ఆలేరు ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ స్వప్న రాథోడ్ తో పాటు డ్యూటీ డాక్టర్ మరియు ప్రైవేటు డాక్టర్లు కె.ప్రభాకర్, ప్రతాప్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు... ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి భాస్కర్ మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అంటే వైద్యుడు శ్రీమహా విష్ణువుతో సమానమని అన్నారు ప్రాణం పోసే శక్తి ఆ భగవంతుడిది అయితే పోతున్న ప్రాణాన్ని నిలబెట్టి తిరిగి సరికొత్త జీవితాన్ని ఇచ్చే దేవుడు వైద్యుడని ఆమె అన్నారు... సాధారణ మనిషి తన కుటుంబం కోసం ఆలోచన చేస్తే వైద్యుడు మాత్రం ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆలోచన చేస్తాడని రాత్రనకా పగలనకా పండుగ ఆనక ప్రజల ఆరోగ్యమే తన శ్రేయస్సుగా పనిచేస్తున్న డాక్టర్లలందరికీ అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు... కరోనా కాలంలో ప్రతి ఒక్కరు తలుపులు మూసుకొని ఇంట్లో కూర్చుంటే ఒక్క డాక్టర్ మాత్రమే తలుపులు తెరిచి ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణాలకు తెగించి పని చేసిన గొప్ప వైద్యులని వారి సేవకు వెలకట్టలేమని ఆమె కొనియాడారు... ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మరియమ్మ మార్కు,యాట శివ,పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్,మల్లెల సరిత శ్రీకాంత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | గురువారం, హైదరాబాద్ | 02-07-2026

# నేతాజీ నగర్‌లో ప్రమాదకర విద్యుత్ తీగలు

- చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ వినతి
- ప్రాణాలు పోతున్న పట్టించుకోరా
- విద్యుత్ వైర్లను సరి చేయండి

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్ నేతాజీ నగర్ కాలనీలో ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేసి, నిర్లక్ష్యం వహించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు చర్లపల్లి టీజీఎస్‌పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాందాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం. కిరణ్, శశాంక్ మాట్లాడుతూ కాలనీలో ఓవర్‌హెడ్ లైవ్ వైర్లు ప్రమాదకరంగా కిందికి వేలాడుతూ పలుచోట్ల దెబ్బతిన్నాయని, అవి స్కూల్ బస్సులు, ప్రజా రవాణా, ఇతర భారీ వాహనాలను తాకే పరిస్థితి ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఏడీఈ రాందాస్ వెంటనే కాంట్రాక్టర్, ఏఈతో మాట్లాడి కాలనీలో పరిశీలన నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శశాంక్, ప్రవీణ్, శివ, శేఖర్‌తో పాటు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# తగ్గిన పెట్రోల్ ధరలు వాహనదారులకు ఊరట!



**మహా వరంగల్ బ్యూరో :** పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుండి పెట్రోల్, డీజిల్ తో పాటు నిత్యవసర సరుకుల ధరలు కూడా అమాంతం ఆకాశాన్నంటాయి. నిత్యం పెరుగుతున్న ధరలతో అల్లాడిపోతున్న వాహనదారులకు ప్రైవేట్ రంగ చమురు దిగ్గజం నయారా ఎనర్జీస్ ఊరటనిచ్చింది. తమ రీటైల్ నెట్వర్క్ లో పెట్రోల్ ధరను లీటరుకు ఏకంగా రూ.5, డీజిల్ ధరను లీటరుకు రూ.3 మేర తగ్గిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. రెండేళ్ల కాలంలో దేశంలో ఇంధన ధరలను తగ్గించిన మొదటి చమురు సంస్థగా నయారా నిలిచింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు సడలడంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు గణనీయంగా పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న నయారా ఎనర్జీకి చెందిన 7,000 కంటే ఎక్కువ పెట్రోల్ బంకులలో ఈ సవరించిన నూతన ధరలు నేటి నుంచి తక్షణమే అమల్లోకి వచ్చాయి. అయితే వాహనదారులకు లభించే అంతిమ రీటైల్ విక్రయ ధరలు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విధించే స్థానిక పన్నులు, వ్యాట్ రేట్ల ఆధారంగా ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. తాజా నిర్ణయంతో నయారా సంస్థ ఆ పెంచిన ధరలను పూర్తిగా రద్దు చేసినట్లు అయింది. కాగా, గుజరాత్లోని వాడినార్లో ఉన్న 20 మిలియన్ టన్నుల సామర్థ్యం గల పెద్ద రిఫైనరీ పనులను విరామం తర్వాత నయారా ఎనర్జీ విజయవంతంగా పునఃప్రారంభించింది. ప్రస్తుతం ఇది దేశీయ ఇంధన డిమాండ్ను తీర్చడానికి పూర్తి సామర్థ్యంతో నడుస్తోంది.

**ప్రభుత్వ సంస్థల బంకుల్లో..!**

ప్రైవేట్ సంస్థ నయారా ఎనర్జీ ధరలను తగ్గించినప్పటికీ ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ), భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం మాత్రం తమ ధరలలో ఎలాంటి మార్పులు చేయలేదని తెలుస్తోంది. దేశంలోని 90 శాతానికి పైగా బంకులు ప్రభుత్వ ఆధీనంలోనే చమురు విక్రయాలు జరుపుతున్నాయి. ఉదాహరణకు న్యూఢిల్లీలో ఐఓసీ బంకుల్లో పెట్రోల్ లీటరుకు రూ.102.12. డీజిల్ రూ.95.20 వద్దే స్థిరంగా కొనసాగుతోంది.

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ సీపీ



**మహా వరంగల్ క్రైం;** వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ గా శ్వేత ఐపీఎస్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఓరుగల్లు ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన పోలీసు కమిషనర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ కు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఏసిపి సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, తదితరులు ఉన్నారు.



# సీఎం సహాయ నిధి వరం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా నిరంతరం కృషి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రూ.2.17కోట్ల విలువచేసే సంక్షేమ చెక్కులను లబ్దిదారులకు అందించిన ఎమ్మెల్యే

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం క్లబ్బులో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాలతో పాటు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ కింద 144 మంది లబ్ధిదారులకు రూ.1,60,00,704 విలువగల చెక్కులను, అలాగే నియోజకవర్గ పరిధిలోని మరో 143 మంది లబ్ధిదారులకు రూ.57,34,500 విలువచేసే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ఆడబిడ్డ పెళ్లి ఆగిపోకూడదనేదే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అదేవిధంగా అనారోగ్యం ఆపద కాలంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారిందని ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతోందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసిల్దార్లు పుల్లయ్య, కృష్ణ ప్రసాద్, ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు వాసిరెడ్డి మురళీ, సర్పంచులు పాల్గొన్నారు.



# స్వాధీనం చేసుకున్న గంజాయి నిర్వీర్యం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 07 కేసులకు సంబంధించిన 948.478 కిలోల గంజాయిని తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ఎంఎస్ ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ ప్రాంగణంలో పూర్తిగా నిర్వీర్యం చేసి బూడిద చేసినట్లు జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ రోహిత్ రాజు బుధవారం తెలిపారు. నిర్వీర్యం చేసిన గంజాయి విలువ సుమారు రూ.4 కోట్ల 74 లక్షలు ఉంటుందని చెప్పారు. నిర్వీర్య ప్రక్రియలో పర్యావరణానికి ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గంజాయి మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేస్తున్నారని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతూ గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నారని తెలియజేశారు. మాదక ద్రవ్యాల క్రయ విక్రయాల గురించి తెలిసినట్లయితే సమాచారాన్ని పోలీస్ వారికి అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ మెంబర్స్ కొత్తగూడెం సబ్ డివిజన్ డిఎస్పి ఆదినారాయణ, భద్రాచలం సబ్ డివిజన్ డిఎస్పి అరుణ్ కుమార్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# టీడీఏ ఆధ్వర్యంలో వైద్యునికి సత్కారం

**నిర్మల్ మహా :** తెలంగాణ డయాగ్నస్టిక్స్ అసోసియేషన్ , నిర్మల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత 26 సంవత్సరాల నుండి మానసిక వ్యాధులకు పట్టణంలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న మానసిక వైద్యులు డాక్టర్ శేఖర్ రెడ్డి ని ఘనంగా శాలువాతో సత్కరించారు. సమాజానికి డాక్టర్లు అందిస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టి డి ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హన్మంతు,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, వకిల్, సుమ,శ్రీనివాస్, అభి,తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు విద్య వద్దు.. ప్రభుత్వ విద్యేముద్దు

- విద్యార్థుల ఉచిత విద్య కొరకు ప్రభుత్వం లక్షల కోట్లు విడుదల చేస్తుంది
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ప్రైవేటు విద్య వద్దు.... ప్రభుత్వ విద్యేముద్దని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం దండేపల్లి మండలం ద్వారక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్యూల్ తెగల బాలుర వసతి గృహ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. అంతేకాకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన విద్య బోధన అందిస్తూ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మార్గం చూపుతోందని అన్నారు. ఈ క్రమంలో చేపట్టిన వసతి గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అధికారులతో కలిసి పరిశీలించి ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, మూత్రశాలల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి కారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు.





# సత్తుపల్లి లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

**లైన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రవికుమార్ కు ఘన సత్కారం**

**సత్తుపల్లి, జూలై 1: మహా :** పట్టణంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఏడాది పాటు విశిష్ట సేవలు అందించి సత్తుపల్లి లయన్స్ క్లబ్ కు గుర్తింపు పెంచిన స్థానిక సామాజిక సేవకుడు గోగడ రవికుమార్‌ను బుధవారం విశ్వశాంతి విద్యాలయంలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... సత్తుపల్లి లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో గోగడ రవికుమార్ గత ఏడాది కాలంలో (తన అధ్యక్ష పదవీకాలంలో) 1,339 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారి సేవలు కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులు, యువతకు అవగాహన కార్యక్రమాలు, క్యాన్సర్ అవగాహన సదస్సులు, యువ వికాస్ కార్యక్రమాలు, విద్యా అవగాహన కార్యక్రమాలు, నేత్రదాన శిబిరాలు విశేషంగా ప్రజలకు ఉపయోగపడ్డాయని తెలిపారు. అలాగే ప్రతిరోజూ "మీల్స్ ఆన్ వీల్స్" కార్యక్రమం ద్వారా ప్రతినిత్యం సుమారు 200 మందికి అల్పాహారం అందించడం ప్రశంసనీయమన్నారు. సత్తుపల్లి హిందూ శ్మశానవాటిక అభివృద్ధి, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యం తదితర సామాజిక కార్యక్రమాల ద్వారా క్లబ్ ఖ్యాతిని గోగడ రవికుమార్ మరింత పెంచారని ఆయన పేర్కొన్నారు. భరణిపాడు సొసైటీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు (నాని) మాట్లాడుతూ సత్తుపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు, నిర్వాహకుల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విబిజి రామ్ జి 2025 రద్దు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం విబి జి రామ్ జి బిల్లును అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- ఎన్ పి ఆర్ డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం దగ్గర నల్ల బ్యాడ్జీలు ప్లే కార్డ్స్ తో నిరసన



**యాదాద్రి భువనగిరి జులై 1 మహా :** కేంద్ర ప్రభుత్వం జులై 1 నుండి అమలు చేస్తున్న వి బి జి రామ్ జి 2025 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జి, ప్లే కార్డ్స్ తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలనుండి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు.నిధులు కేటాయించ కుండా పనిరోజులను తగ్గించిందని అన్నారు. వి బి జి రామ్ జి 2025 పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టి జూలై 1 నుండి అమలు చేయాలని నిర్ణయం చేసిందని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం గ్రామీణ ప్రాంత వికలాంగుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. పాత చట్టం ప్రకారం ప్రతి వికలాంగునికి 150 రోజులు పని కల్పిస్తున్నారని అన్నారు. కొత్త చట్టం ప్రకారం 60 రోజులు పని ఉండదని ప్రభుత్వం నిర్ణయం చేసిందని అన్నారు.125 రోజులకు పని రోజులు పెంచినమని గొప్పలు చెపుతున్న కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సీజన్లో 60 రోజులు పని బంద్ పెట్టాలని ఎందుకు నిర్ణయం చేసిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం నిధులు కేటాయించాలని నిర్ణయం చేసిందని దీని వలన రాష్ట్ర ప్రభుత్వలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు.సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ అంటున్న మోడీ వికలాంగులకు ఉపాధి కల్పిస్తున్న పథకాన్ని ఎందుకు రద్దు చేశారాని ప్రశ్నించారు.ఉపాధి హామీ పథకం అమలు ద్వారా గ్రామాల్లోని వికలాంగులలో నిరుద్యోగం తగ్గిందని అన్నారు.ప్రభుత్వం నిర్ణయం వలన గ్రామాల్లోని వికలాంగులలో మళ్ళీ నిరుద్యోగం పెరుగుతుందని అన్నారు.ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగం పెంచే విధానాలను అమలు చేయడం సిగ్గుచేటని అన్నారు.ప్రతి వికలాంగునికి జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలీ 800 లకు పెంచాలని డిమాండ్ చేశారు, విబి జి రామ్ జి రద్దు అయ్యే వరకు ఉద్యమం చెస్తామని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్ల పెల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు గొడుగు దాసు, జిల్లా కమిటీ సభ్యులు పాండాల శ్రీహరి, జిల్లా కమిటీ సభ్యులు భగవంతు రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వేషాల గోపి,అవనిగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



**ఆదిలాబాద్ మహా:** మీసేవ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. భోరాజ్ మండలం పెండల్‌వాడ గ్రామంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత మెరుగ్గా, వేగంగా అందాలనే ఉద్దేశంతోనే ఈ నూతన మీసేవ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వివిధ రకాల ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల దరఖాస్తుల కోసం గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లే పనిలేకుండా, ఈ కేంద్రం ద్వారా స్థానికంగానే సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. కేంద్ర నిర్వాహకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. గ్రామంలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్ గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రా, తహసీల్దార్ బాబు సింగ్, మీసేవ పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఈడీఎం రవి, కేంద్ర నిర్వాహకురాలు గుమ్మడి ఆయేషా, సర్పంచ్ లాస్మన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్

**వలిగొండ జులై 1 మహా న్యూస్** మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో బుధవారం ఎస్ ఐ ఆర్ ప్రత్యేక జాబితా సవరణ ప్రక్రియను బుధవారం తహసిల్దార్ దశరథ సమీక్షించారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని అన్నారు ఇందుకోసం క్షేత్రస్థాయిలో బిఎల్ఓ లు ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తూ సమర్థవంతంగా పని చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిఎల్ఓ వనం జనార్ధన్ అప్సర్ తదితరులు పాల్గొన్నారు



# 'సర్' ప్రక్రియ కార్యక్రమాన్ని ఓటర్లు వినియోగించుకోవాలి

**.బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్**



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని ఓటర్లు 'సర్' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం నాడు ఆయన పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనలతో బెల్లంపల్లి టౌన్ కన్నాలబస్తి 14వ వార్డు బూత్ నంబర్ 105,, టేకులబస్తి 15వ వార్డు బూత్ నంబర్ 99 లలో ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బెల్లంపల్లి పట్టణ వార్డులలో కొనసాగుతున్న కార్యక్రమం అమలు తీరును, ప్రజలకు అందుతున్న సేవలను పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, టీపీసీసీ మెంబర్ ఛిలుముల శంకర్, నాయకులు మల్లరపు చిన్నరాజం , ప్రోగ్రామ్ నియోజకవర్గ ట్రైనర్ ఖాజాపాషా, వార్డు కౌన్సిలర్ చింతల వసంత మాజీ కౌన్సిలర్ బొడ్డునారాయణ, మంచిర్యాల జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్, కన్నూరి వెంకటేష్ టేకులబస్తి ఇన్చార్జ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆసరి అభిలాష్ యాదవ్, సాయి కిరణ్ యాదవ్ పట్టణ యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ, బొల్లి వంశీ, గజ్జల రామ్నాథ్ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్, వార్డు అధ్యక్షులు, బూత్ నంబర్:105 బి ఎల్ ఎ దూడపాక మనోజ్, బి ఎల్ ఓ సిద్ధంశెట్టి ఉమారాణి, బూత్ నంబర్:99 బి ఎల్ ఎ చింతల లోకేష్, బిఎల్ఓ బండారి ముత్యాలు, లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా కార్యక్రమం పారదర్శకంగా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని సంబంధిత బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లకు సూచనలు చేశారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటర్ అవగాహన కార్యక్రమం పై ప్రజలందరూ సహకరించాలని బండి ప్రభాకర్ యాదవ్ పట్టణ అధ్యక్షులు కోరారు..ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎ లు రేగుంట రాజలింగు, గజ్జెల రాజశేఖర్, గద్దెల కుమార్, వాహెబ్, ఖలీల్, గజ్జల రాజశేఖర్, యూసుఫ్, కార్తిక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ఓటర్లు ప్రజలు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరికలెక్టర్

**ఆదిలాబాద్ మహా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదయ్యేలా చూడాలని, అలాగే జాబితాలో తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాల్లో రాజకీయ పార్టీలు క్రియాశీలక పాత్ర పోషించాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, వైస్ చైర్మన్ రోహిత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్ లతో పాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా సంఘాల సభ్యులకు
# సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలి

- **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జూలై 1 మహా** మహిళా సంఘాల సభ్యులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు బుధవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య అధికారి మనోహర్, రాష్ట్రస్థాయి అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 1,94,493 మంది స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఉన్నారని తెలిపారు. వారందరికీ దశలవారీగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మహిళకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రక్తంలో చక్కెర పరీక్ష, సీరం బిలిరుబిన్, సీరం క్రియాటినిన్, బ్లడ్ యూరియా, ఎస్‌జీపీటీ, ఎస్‌జీఓటీ, సీరం ఆల్కలైన్ ఫాస్ఫటేస్, సీరం టోటల్ ప్రోటీన్, సీరం ఆల్బుమిన్ వంటి 10 బయోకెమిస్ట్రీ పరీక్షలు, థైరాయిడ్ పనితీరును అంచనా వేసే టీఎస్‌హెచ్ పరీక్షతో పాటు హీమోగ్లోబిన్, తెల్ల రక్తకణాల సంఖ్య, ప్లేట్‌లెట్ కౌంట్, ఎర్ర రక్తకణాల సంఖ్య తదితర 7 హీమటాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా రక్తగ్రూప్, ఎత్తు, బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (BMI), రక్తపోటు, వైకల్య నిర్ధారణ, శరీర ఉష్ణోగ్రత, గుండె స్పందన రేటు, శ్వాస రేటు, కంటి పరీక్ష, నోటి పరీక్ష, చర్మం మరియు గోళ్ల పరీక్షలు వంటి 12 స్పోక్ స్థాయి ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా మహిళల్లో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న ల్యాబ్ మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, మానవ వనరులు, రీఏజెంట్లు మరియు ఇతర అవసరమైన సామగ్రిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షలు, నమూనాల సేకరణ, డేటా నమోదు, ఫాలోఅప్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు మెప్మా, మున్సిపల్ శాఖ మరియు డీఆర్‌డీఏ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పోచంపల్లి, షరాజీపేట్ మరియు బీబీనగర్ ను మాస్టర్ ట్రైనర్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ల ద్వారా మిగిలిన ఆరోగ్య సిబ్బందికి శిక్షణ అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య స్థితిపై సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతో పాటు, వ్యాధులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీసీహెచ్ఎస్, ఆర్ఎంఓలు, వైద్యులు, టీహబ్ ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పాత ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలి

- **విబీజీ రామ్‌జీ చట్టం అమలు నిలిపివేయాలని డిమాండ్**
- **కలెక్టర్, డీఆర్‌డీఓకు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘాల వినతి**

**యాదాద్రి భువనగిరి, జూలై 1 (మహా)**: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విబీజీ రామ్‌జీ చట్టాన్ని నిలిపివేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరు బాలరాజు మాట్లాడుతూ, గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు సరికావని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కొత్త చట్టాన్ని అమలు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు.2005లో అమల్లోకి వచ్చిన ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషించిందని, కరోనా సమయంలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. కొత్త చట్టంలో కేంద్ర ప్రభుత్వం నిధుల వాటాను తగ్గించడం, రాష్ట్రాలపై అదనపు భారం మోపడం, వ్యవసాయ సీజన్‌లో పనిదినాలపై ఆంక్షలు విధించడం, పని ప్రదేశంలో కార్మికుల ఫొటోలు తప్పనిసరి చేయడం వంటి నిబంధనలు కార్మికులకు ఇబ్బందికరంగా మారతాయని విమర్శించారు.
అంతేకాకుండా గ్రామ పంచాయతీలు, గ్రామసభల పాత్రను తగ్గించి పనుల ఎంపిక అధికారాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకోవడం వల్ల వికేంద్రీకరణ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని అన్నారు. కొత్త చట్టం అమలైతే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితర సిబ్బందితో పాటు ఉపాధి కూలీలకు కూడా నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలగాని జయరాములు, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి, సహాయ కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి స్థలాల కోసం పోరాటానికి కదిలి రావాలి

**యాదాద్రి భువనగిరి జులై 1 మహా:** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్, 250 గజాల ప్లాటు, హెల్త్ కార్డు ఉచిత బస్ పాసు తదితర సౌకర్యాలు వెంటనే కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు... నేడు భువనగిరిలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఉద్యమకారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు... 250 గజాల ప్లాట్ల కోసం కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు జూలై 2న చలో ఉప్పల్ బాగాయత్తుకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఉద్యమకారులకు ఆయన పిలుపునిచ్చారు





## స్వగ్రామాన్ని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

- **పరామర్శలు- ఒకరికి ఆర్థిక సాయం,**
- **గ్రామస్తులతో మాటామంతీ**

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బుధవారం తన స్వగ్రామం తాంసి మండలం హస్నాపూర్ గ్రామాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. గ్రామంలో అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పెద్దలకు నమస్కరించి దీవెనలు తీసుకున్నారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న హరీష్ రెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామంలోని చినబాయిని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ జడ్పిటిసి కొండా గంగాధర్, నాయకులు సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి, రతన్ రెడ్డి, వెంకట్ రెడ్డి,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



### గరీబోళ్ల గుడిసెలు తొలగించకుండా...
# పట్టాలు ఇవ్వండి

- **వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో వినతి పత్రం సమర్పణ**

**కుషాయిగూడ, మహా** : జవహర్ నగర్ లో గరీబోళ్ల గుడిసెలు తొలగించకుండా వెంటనే ఇండ్ల పత్రాలు మంజూరు చేయాలని, వామపక్షాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ,సిపిఎం శివన్నారాయణ, న్యూ డెమోక్రసీ అనురాధ, మాస్ లైన్ ప్రవీణ్ తదితరులు బుధవారం జిల్లా కలెక్టరేట్లో వినతి పత్రం సమర్పించారు. జవహర్ నగర్ లో తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీల పిలుపుమేరకు బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ మాలతికి ఇండ్ల పట్టాలు ఇండ్ల స్థలాల తొలగింపు కేటాయింపులపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్ నగర్ లో వామపక్షాల ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇంతకుముందు గుడిసెలు వేయడం జరిగిందని ఆ గుడిసెలను నేడు తొలగించాలని ప్రభుత్వం భావిస్తే పేద ప్రజలకు నష్టం కలుగుతుందని వారికి వెంటనే పట్టాలు ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ కేటాయింపులో ఎల్ టు పేరిట చూపిన సమాచారం మేరకు నేడు వాహనాలు లేకున్నా వాహనాలు ఉన్నట్టు చూపి వారిని అనర్హులుగా చేయడం అన్యాయమని వెంటనే అలాంటి వారికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రజలకు లక్షలాది రూపాయలు కు అమ్మి న భూములజోలికి పోకుండా పేద ప్రజలు వేసుకున్న గుడిసెల జోలికి పోవడం అన్యాయమని కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాదారులను రక్షించవద్దని ప్రభుత్వం కబ్జాదారులపై ఉక్కు పాదం మోపాలి అన్నారు. లేకపోతే రానున్న రోజుల్లో పేద ప్రజలను సమీకరించుకొని వామపక్షాల ఆధ్వర్యంలో మరో భూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, ధర్మేంద్ర, రచ్చ కిషన్, నిమ్మల నరసింహులు, నాయకులు నరేష్, శివ బాబు, శ్యామ్, జయసుధ, సురేష్, ఫాతిమా, లక్ష్మీబాయి, కనకమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## ఓటు భారత దేశ పౌరులకు వజ్రాయుధం

- **ఓటరు జాబితా సవరణలో ప్రజలందరూ భాగస్వాములవ్వండి.**
- **ఇంటింటికీ ఎన్యూమరేషన్ బృందం**

**కుషాయిగూడ, మహా** : ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటరు జాబితా సవరణలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని గబ్బిలాల పేట అంగన్వాడీ టీచర్ అనురాధ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం గబ్బిలాలపేట పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించే ఎన్యూమరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్రజలకు ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవడం, అవసరమైతే కొత్త ఓటర్ ఐడీ కోసం దరఖాస్తు (అప్లికేషన్ ఫారం) సమర్పించడం, వివరాల్లో మార్పులు లేదా సవరణలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పి రాజ్యలక్ష్మి, సీనియర్ జర్నలిస్టు దామరపల్లి నరసింహారెడ్డి, చింతల విజయ్, రఘు, వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ, బిజెపి కార్మిక నగర్ ఉపాధ్యక్షుడు రాజు, పాండు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూముల్లో... అక్రమ నిర్మాణాలను చేపడితే సహించం.

**కాప్రా మండల తాసిల్దార్ మతిన్ హెచ్చరిక**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే సహించబోమని కబ్జాదారుల పని పడతామని, అక్రమ దారుల ఆగడాలను ఇకపై సహించబోమని కాప్రా మండల తాసిల్దార్ మతిన్ హెచ్చరించారు. జవహర్ నగర్ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరిగాయనే సమాచారం మేరకు కాప్రా మండల తాసిల్దార్ మతిన్ ఆదేశాల మేరకు బుధవారం గిర్ధవార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా మతిన్ మాట్లాడుతూ సర్కారు భూములను అమాయక పేదలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నజరు పెట్టామని త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఇకపై జవహర్ నగర్ లో ఎలాంటి అక్రమ కట్టడాలను చేపట్ట రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ వేడుకలలో కంది శ్రీనన్న..

ఆదిలాబాద్ మహా : అభిమానంతో ఆహ్వానించిన వారి శుభకార్యాలకు హాజరవుతూ వారి వేడుకలలో భాగమవుతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి .బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు కళ్యాణమండపాలలో జరిగిన వివాహవేడుకలు, రిసెప్షన్లు , గృహప్రవేశాలకు పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. నూతన వధూవరులను దీవించి పెళ్లి కానుకలు బహూరించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్,మాజీ జడ్పిటిసి కొండా గంగాధర్, నాయకులు సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి, రతన్ రెడ్డి, వెంకట్ రెడ్డి,అరవింద్ తదితరులు పాల్గొన్నారు..

## లయన్స్ చార్టర్ డే.. విద్యార్థులకు నోట్‌బుక్స్

**పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యం**
**మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు**

కుషాయిగూడ, మహా : లయన్స్ జిల్లా 324 హెచ్ చార్టర్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో సౌత్ కమలనగర్ ప్రభుత్వ ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాభ్యాసంలో అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పాటు అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు, జిల్లా కార్యదర్శి (గ్లోబల్ కాజెస్) కొత్తపల్లి రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు తారకేశ్వరరావు, కార్యదర్శి వెంకట రామరాజు, కోశాధికారి మోహన్, సభ్యులు చంద్రశేఖర్, రవిశంకర్ రాజు, పెద్ది శ్రీనివాస్, అంజనీ కుమార్, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ రవి ప్రసాద్‌కు, సహకరించిన మాజీ జిల్లా గవర్నర్ గంప నాగేశ్వరరావుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.





## ఉప్పల్ బగాయిత్ భూ పోరాటాన్ని విజయవంతం చేయండి

**తెలంగాణ ఉద్యమకారుల పిలుపు**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 2న ఉప్పల్ బగాయిత్‌లో నిర్వహించనున్న భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరిస్తోందని వారు ఆరోపించారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్, ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం జీవో జారీ చేసి కేకే కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం ఉద్యమకారుల్లో అసంతృప్తికి కారణమైందన్నారు. టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో చేపట్టనున్న భూ పోరాటం ఉద్యమకారుల హక్కుల సాధనకు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారుల హక్కులు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లూరి అనిల్‌కుమార్, జేఏసీ చైర్మన్ రామగిరి ప్రకాష్, బీరకాయల మధుసూదన్, తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాసరావు, ప్రశాంత్ చారి, జాముల స్రవంతి, కుసుమ రజిత, ఆవుల జ్యోత్స్న, కొనుగుంట్ల నవీన్ యాదవ్, గీత సింధు, బుర్కా సందీప్ తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని మౌలాలి డివిజన్‌కు చెందిన మద్దాలి సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# మైక్రోసాఫ్ట్ లో మరోసారి ఉద్యోగాల కోత?




ప్రపంచ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోమారు భారీగా ఉద్యోగాల తొలగింపునకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఖర్చులను నియంత్రించడమే లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ, త్వరలోనే కొత్త రౌండ్ లేఆఫ్స్‌ను ప్రకటించవచ్చని ప్రముఖ మీడియా సంస్థ బిజినెస్ ఇన్‌సైడర్ అంచనా వేసింది. ముఖ్యంగా కంపెనీకి చెందిన ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంతో పాటు సేల్స్, కన్సల్టింగ్ విభాగాల్లోని వేలాది ఉద్యోగాలపై ఈ ప్రభావం పడనుందని పేర్కొంది. గత ఏడాది (2025) మే నెలలో 6,000 మందిని, జులైలో సంస్థ మొత్తం సిబ్బందిలో 4 శాతానికి సమానమైన 9,000 మంది ఉద్యోగులను మైక్రోసాఫ్ట్ తొలగించిన సంగతి తెలిసిందే. అయితే, గత ఏడాదితో పోలిస్తే ఈసారి జరగబోయే కోతలు కొంత తక్కువగానే ఉండవచ్చని సమాచారం. కంపెనీకున్న మొత్తం 2,20,000 మంది ఉద్యోగుల్లో ఈ తాజా లేఆఫ్స్ ప్రభావం 2.5% కంటే తక్కువగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

### ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే నిర్ణయం?

సాధారణంగా మైక్రోసాఫ్ట్ తన కొత్త ఆర్థిక సంవత్సరాన్ని జులై 1 నుంచి ప్రారంభిస్తుంది. ఈ నేపథ్యంలోనే వచ్చే వారం నాటికి ఈ ఉద్యోగాల కోతపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఈ గడువులో స్వల్ప మార్పులు ఉండవచ్చు. ఈ ప్రక్రియలో ప్రభావితమయ్యే కొంతమంది ఉద్యోగులకు అంతర్గతంగా వెంటనే కొత్త బాధ్యతలను అప్పగించే యోచనలో కూడా కంపెనీ ఉన్నట్లు తెలుస్తోంది.

### ఏఐపై పెరుగుతున్న ఖర్చు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతపై మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఏఐ అప్లికేషన్లు, సాఫ్ట్‌వేర్ సేవల విస్తరణకు వ్యయం పెరుగుతుండటంతో ఇతర విభాగాల్లో ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు భవిష్యత్తులో ఏఐ సాఫ్ట్‌వేర్ సాంకేతికత వల్ల కొన్ని సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవల అవసరం తగ్గుతుందనే ఆందోళనలతో అమెరికా స్టాక్ మార్కెట్ నుంచి కంపెనీపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గత నెలలో మైక్రోసాఫ్ట్ స్టాక్ సుమారు 17 శాతం మేర క్షీణించింది.

### గేమింగ్ విభాగంలో రీసెట్ వ్యూహం

మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంలో ఈ మార్పులు ఊహించినవేనని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్స్‌బాక్స్ నూతన సీఈఓ ఆశా శర్మ ఇటీవల ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో.. వ్యాపారాన్ని సరికొత్తగా రీసెట్ చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ రీస్ట్రక్చరింగ్‌లో భాగంగానే గేమింగ్ విభాగంలో ఉద్యోగాల కోత విధిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### స్వచ్ఛంద పదవీ విరమణ అస్త్రం

గత ఏడాదితో పోలిస్తే ఈసారి లేఆఫ్స్ ప్రభావం తగ్గడానికి కంపెనీ ప్రవేశపెట్టిన స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలోనే అమెరికాలోని ఉద్యోగుల కోసం మైక్రోసాఫ్ట్ ఒక ప్రత్యేక బైఅవుట్ ఆఫర్‌ను ప్రకటించింది. వయస్సు, సర్వీస్ కాలం ఆధారంగా రూపొందించిన ఈ పథకానికి అమెరికాలోని సంస్థ మొత్తం వర్క్‌ఫోర్స్ (1,25,000 మంది)లో సుమారు 7 శాతం (దాదాపు 9,000 మంది) ఉద్యోగులు అర్హత సాధించారు. కంపెనీ అంచనాలకు అనుగుణంగానే అర్హులైన వారిలో మూడింట ఒక వంతు మంది ఉద్యోగులు ఈ స్వచ్ఛంద విరమణను ఎంచుకున్నారు. ఫలితంగా సంస్థకు సహజంగానే ఉద్యోగుల సంఖ్య తగ్గింది. అయితే, కమీషన్ ఆధారిత వేతనాలు పొందే సేల్స్ ఉద్యోగులకు మాత్రం ఈ వీఆర్ఎస్ ఆఫర్ వర్తించలేదని కంపెనీ అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైంది. అందుకే ఇప్పుడు నేరుగా సేల్స్, కన్సల్టింగ్ విభాగాల్లో ఉద్యోగాల తగ్గింపునకు మైక్రోసాఫ్ట్ సిద్ధమవుతోంది.

# ఒక్క నెలలో రూ.1.94 లక్షల కోట్లు



దేశ జీఎస్టీ వసూళ్లు గడిచిన జూన్‌లో బలమైన వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. స్థూల జీఎస్టీ ఆదాయం 13.9 శాతం పెరిగి రూ.1,94,812 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే నెలలో ఇది రూ.1,71,105 కోట్లుగా ఉండటం గమనార్హం. నికరంగా (రిఫండ్లు మినహాయించిన తరువాత) జీఎస్టీ వసూళ్లు 11.2 శాతం పెరిగి రూ.1,62,377 కోట్లుగా నమోదయ్యాయి. అదే సమయంలో నెలలో రీఫండ్లు గణనీయంగా పెరిగి రూ.32,436 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 29.1 శాతం అధికం. కేంద్ర జీఎస్టీ (CGST) వసూళ్లు 8 శాతం పెరిగి రూ.37,376 కోట్లకు చేరగా, రాష్ట్ర జీఎస్టీ (SGST) 4 శాతం వృద్ధితో రూ.45,116 కోట్లుగా నమోదైంది. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (IGST)లోనూ బలమైన పెరుగుదల కనిపించింది. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఐజీఎస్టీ రూ.52,282 కోట్లుగా ఉండగా, దిగుమతులపై వసూళ్లు 34.6 శాతం భారీ వృద్ధితో రూ.60,038 కోట్లకు చేరాయి. దేశీయ స్థూల ఆదాయాలు మొత్తం 6.5 శాతం పెరిగి రూ.1,34,774 కోట్లుగా నమోదయ్యాయి. ఇది దేశీయ వినియోగం, సేవల రంగంలో కొనసాగుతున్న స్థిరమైన డిమాండ్‌ను సూచిస్తోందని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్ర 9 శాతం వృద్ధితో రూ.30,714 కోట్ల జీఎస్టీ వసూళ్లను నమోదు చేసి మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ 19 శాతం వృద్ధితో రూ.9,165 కోట్లు సాధించింది. గుజరాత్ రూ.11,743 కోట్లు (12% వృద్ధి), కర్ణాటక రూ.12,937 కోట్లు (10% వృద్ధి), హర్యానా రూ.10,065 కోట్లు (9% వృద్ధి) నమోదు చేశాయి. అయితే తమిళనాడు మాత్రం స్వల్పంగా 2 శాతం తగ్గుదలతో రూ.9,776 కోట్లకు పరిమితమైంది.

# క్లాడ్ ఏఐ మోడళ్లపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా




ఆంత్రోపిక్ సంస్థకు చెందిన శక్తివంతమైన ఏఐ మోడళ్లు 'క్లాడ్ ఫేబుల్ 5' (Claude Fable 5), 'మైథోస్ 5'(Mythos 5)లపై విధించిన విదేశీ యాక్సెస్ ఆంక్షలను అమెరికా ఎత్తివేసింది. అమెరికా వాణిజ్య శాఖ తన నియంత్రణలను తొలగించినట్లు ధ్రువీకరించిన అనంతరం ఈ మోడళ్ల సేవలను పునరుద్ధరిస్తున్నట్లు ఆంత్రోపిక్ అధికారికంగా ప్రకటించింది. 'మా వినియోగదారుల సహనానికి, అలాగే మోడళ్లను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని ఆంత్రోపిక్ సంస్థ ఎక్స్ వేదికగా పేర్కొంది.

### భద్రతా హామీలతో లభించిన ఊరట

ఆన్‌లైన్‌లో విస్తృతంగా ప్రసారమైన ఒక లేఖలో అమెరికా వాణిజ్య శాఖ కార్యదర్శి హోవార్డ్ లుత్నిక్ ఈ నిర్ణయానికి గల కారణాలను స్పష్టం చేశారు. ఆంత్రోపిక్ సంస్థ ఇకపై ప్రత్యేక ఎగుమతి లైసెన్స్ పొందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఏఐ మోడళ్లతో ముడిపడి ఉన్న భద్రతా ప్రమాదాలను ముందస్తుగా గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఆంత్రోపిక్ అంగీకరించడమే ఇందుకు ప్రధాన కారణం. దీనితో పాటు, రాబోయే ఏఐ మోడళ్ల ప్రమాణాలపై ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి, ఎలాంటి హానికరమైన కార్యకలాపాలు జరిగినా వెంటనే ప్రభుత్వానికి తెలియజేయడానికి సంస్థ అంగీకరించింది.

### అసలేం జరిగింది? ఆంక్షల నేపథ్యం ఇదే..

గత నెలలో(జూన్) డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా యంత్రాంగం ఆంత్రోపిక్ సంస్థకు ఊహించని షాక్ ఇచ్చింది. కంపెనీ ఉద్యోగులతో సహా విదేశీ పౌరులు ఎవరూ ఈ మోడళ్లను యాక్సెస్ చేయకుండా నిరోధించాలని ఆదేశించడంతో సంస్థ అకస్మాత్తుగా ఫేబుల్ 5, మైథోస్ 5 సేవలను నిలిపివేసింది. ఆ సమయంలో ప్రభుత్వం నిర్దిష్ట కారణాలేవీ చెప్పనప్పటికీ ఫేబుల్ 5లోని భద్రతా అంశాలపై అధికారులు ఆందోళన చెందడమే ఇందుకు కారణమని భావించారు. అయితే, గత శుక్రవారం క్లిష్టమైన మౌలిక సదుపాయాలను నిర్వహించే అమెరికా సంస్థలకు మాత్రమే వీటిని ఉపయోగించేందుకు అనుమతి లభించింది. ఇప్పుడు తాజాగా సాధారణ ప్రజలకు కూడా పూర్తిస్థాయి యాక్సెస్ ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### ట్రంప్ ప్రభుత్వం వర్సెస్ ఆంత్రోపిక్

ట్రంప్ పరిపాలనా యంత్రాంగానికి, ఆంత్రోపిక్ సంస్థకు మధ్య కొంతకాలంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఆంక్షలు ఆ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోశాయి. గత మార్చిలో ఆంత్రోపిక్ ఏఐ సంస్థ రక్షణ శాఖ (పెంటగాన్)పై దావా వేసింది. తమ ఏఐ సాధనాలను సామూహిక నిఘా లేదా స్వయంప్రతిపత్త ఆయుధాల కోసం ఉపయోగించబోమని స్పష్టమైన హామీలు ఇవ్వనందుకు పెంటగాన్ ఈ సంస్థను సప్లై చెయిన్ రిస్క్‌గా లేబుల్ చేసింది. దీనిపై సంస్థ న్యాయ పోరాటానికి దిగింది. మరోవైపు, చాట్ జీపీటీ మాతృ సంస్థ ఓపెన్ ఏఐ సైతం తమ తాజా మోడల్ సిరీస్ 'జీపీటీ 5.6'ను మొదట కేవలం 'విశ్వసనీయ భాగస్వాముల చిన్న సమూహం' కోసం మాత్రమే విడుదల చేయనున్నట్లు గత వారం ప్రకటించింది.


### నిపుణులు ఏమంటున్నారు?

ఈ పరిణామాలపై సిడ్నీ విశ్వవిద్యాలయంలోని ఏఐ, ట్రస్ట్ అండ్ గవర్నెన్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఫ్రాన్సిస్కో బైలో స్పందిస్తూ, టెక్ వర్గాల్లో ఈ ఆంక్షల ఎత్తివేత ఊహించిందేనని అన్నారు. 'పరిశోధకులు ఫేబుల్ 5ను జైల్‌బ్రేక్(ఏఐ మోడళ్లకు వాటిని తయారు చేసిన కంపెనీలు కొన్ని భద్రతా నియమాలను, నైతిక పరిమితులను విధిస్తాయి. ప్రమాదకరమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఈ ఏఐ మోడళ్లను నియంత్రిస్తారు) చేయగలిగారనే నివేదికలు వాస్తవ తీవ్రత కంటే ఎక్కువగా ప్రచారమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అతిగా స్పందించిందని ఆలస్యంగా గ్రహించింది. ఇటువంటి నిర్ణయాలు పరిశ్రమలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఒకవేళ ఫేబుల్, మైథోస్‌లను నిషేధిస్తే భవిష్యత్తులో మార్కెట్లోకి వచ్చే ఇతర పోటీ నమూనాలను కూడా నిషేధించాల్సి వస్తుంది' అని పేర్కొన్నారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# వెనిజువెలాలో వింత..
# నెత్తురు రంగులోకి మారిన ఆకాశం


**కారకాస్:** వెనిజువెలా రాజధాని కారకాస్‌లో జూన్ 30 మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా దట్టమైన ఎరుపు, నారింజ రంగుల్లోకి మారిపోవడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో చాలా కిందకు కనిపిస్తున్న ఎర్రటి మేఘాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. జూన్ 24న వెనిజువెలాలో సంభవించిన భారీ జంట భూకంపాల కారణంగా దాదాపు 2,000 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది భవనాలు శిథిలమయ్యాయి. ఈ విషాదం నుంచి తేరుకోకముందే ఆకాశం ఇలా నెత్తురు రంగులోకి మారడంతో, ఇది రాబోయే వినాశనానికి సంకేతమంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ భయానక దృశ్యం వెనుక పూర్తి శాస్త్రీయ కారణం ఉందని నిపుణులు వెల్లడించారు. సహారా ఎడారి నుంచి వీచిన సూక్ష్మమైన ధూళి కణాలు వాతావరణంలోకి చేరి సహజమైన ఫిల్టర్‌లా పనిచేయడం వల్లే ఈ మార్పు జరిగింది. దీనితో పాటు భౌతికశాస్త్రంలోని 'రేలీ స్కాటరింగ్' లేదా స్థానికంగా 'కాండిలాజో' అని పిలిచే కాంతి పరిక్షేపణ ప్రక్రియ ఇందుకు తోడైంది. సాధారణంగా పగటిపూట ఆకాశం నీలిరంగులో కనిపించడానికి కారణమయ్యే తక్కువ తరంగదైర్ఘ్యం గల కాంతి కిరణాలు ఈ ధూళి కణాల వల్ల పక్కకు చెల్లాచెదురైపోయాయి. కేవలం ఎక్కువ తరంగదైర్ఘ్యం కలిగిన ఎరుపు, నారింజ రంగు కిరణాలు మాత్రమే ఈ ధూళిని దాటుకుని భూమిని చేరడం వల్ల ఆకాశం ఈ రంగులో కనిపించింది. ప్రకృతి సృష్టించిన ఈ వింత దృశ్యం ఒకవైపు కనువిందు చేస్తున్నప్పటికీ, భూకంపాల ధాటికి సర్వస్వం కోల్పోయిన వెనిజువెలా ప్రజలకు మాత్రం ఇది తీవ్ర భయాన్ని కలిగించింది. సహాయక చర్యలు జరుగుతున్న ప్రాంతాల్లో శిథిలాల వెనుక ఎర్రటి ఆకాశం కనిపించడం అక్కడి విషాదకర పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ సహారా ధూళి త్వరలోనే అమెరికాలోని ఫ్లోరిడా వైపునకు ప్రయాణించనున్నదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# 'పాక్'లో కూలిన ట్యూషన్ సెంటర్ పైకప్పు.. 14 మంది మృతి!



**లాహోర్:** పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాష్లో జిల్లా పరిధిలోని ఈద్గా బస్తీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక నివాస భవనం పైకప్పు కూలిపోయింది. అక్కడ ఒక ప్రైవేట్ ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో 14 మంది పాఠశాల విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఏడు నుండి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు క్లాసులో ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు, స్థానికులు శిథిలాల నుండి 20 మందిని సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారిలో ఒక మహిళా ఉపాధ్యాయురాలితో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. భవనంపై కార్మికులు పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, నాణ్యతా లోపమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించి కాంట్రాక్టర్‌తో సహా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషాద ఘటనపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ ఈ ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి, వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను, జిల్లా అధికారులను ఆదేశించారు.

# కాన్సాస్‌లో ఆకస్మిక వరదలు
## ఏపీకి చెందిన టెకీ దుర్మరణం



అమెరికాలో కాన్సాస్‌లో సంభవించిన తీవ్రమైన ఆకస్మిక వరదల్లో (Flash Floods) చిక్కుకుని వెంకటేష్ దొప్పలపూడి (33) అనే భారతీయ ఐటీ నిపుణుడు, ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని పర్చూరు మండలానికి చెందినవ్యక్తిగా గుర్తించారు. శనివారం మధ్యాహ్నం ఆయన హ్యూస్టన్ నుండి ఉత్తర దిశగా కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాపట్ల జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి రాంబాబు పెద్దకుమారుడు దొప్పలపూడి వెంకటేష్ (33) విదేశాల్లో విద్యనభ్యసించేందుకు గతంలో అమెరికా వెళ్లాడు. వెంకటేష్ నెబ్రాస్కాలో నివసిస్తూ, H1B వీసాపై అక్కడ ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సౌత్‌సెంట్రల్ కాన్సాస్‌లో కురిసిన భారీ వర్షాల (6 ఇంచుల కంటే ఎక్కువ వర్షపాతం) కారణంగా అకస్మాత్తుగా వరదలు పోటెత్తాయి. వెల్లింగ్టన్‌లోని 'సౌత్ ఆలివర్ రోడ్' బ్రిడ్జ్ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న కారు వరద నీటిలో మునిగిపోయింది. కారులో ఒకరు చిక్కుకున్నారని ప్రత్యక్ష సాక్షులు సమాచారం అందించడంతో సమ్నర్ కౌంటీ ఎమర్జెన్సీ రెస్పాండర్స్ రంగంలోకి దిగారు. అయిత వరద ఉధృతి, బలమైన ప్రవాహాల కారణంగా ప్రారంభంలో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు డ్రోన్లు, ఎయిర్ యూనిట్లను రంగంలోకి దించి గాలింపు చేపట్టారు. కాన్సాస్ హైవే పెట్రోల్ ఎయిర్ యూనిట్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన గాలింపు అనంతరం ఆదివారం వెంకటేష్ మృతదేహాన్ని వెలికితీశారు. హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఈ ఘటనపై ఎక్స్ వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించింది. ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, మృతదేహాన్ని భారతదేశానికి (స్వగ్రామానికి) తరలించేందుకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయడానికి స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని కన్సులేట్ పేర్కొంది.

# స్కాట్లాండ్ చేరిన పురాతన 'గురు గ్రంథ్ సాహిబ్' ప్రతి



**ఎడిన్‌బర్గ్:** బ్రిటిష్ కాలంలో పూర్వపు సిక్కు సామ్రాజ్యం నుండి తరలించిన 300 ఏళ్ల నాటి పవిత్ర గురు గ్రంథ్ సాహిబ్ చేతిరాత ప్రతి ఎట్టకేలకు స్కాట్లాండ్‌కు చేరింది. పంజాబ్ రెండవ పాలకుడైన మహారాజా ఖడగ్ సింగ్‌కు చెందినదిగా భావిస్తున్న ఈ పురాతన ప్రతిని భక్తుల దర్శనార్థం గ్లాస్గోలోని సెంట్రల్ గురుద్వారాలో ఉంచనున్నారు. ఈ అరుదైన ప్రతిని ఎడిన్‌బర్గ్, గ్లాస్గో గురుద్వారా ప్రతినిధులతో కలిసి స్కాట్లాండ్‌కు తీసుకువచ్చినట్లు స్కాట్లాండ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 1700ల కాలానికి చెందిన ఈ చేతిరాత ప్రతిని, 1848లో బ్రిటిష్ వారు పంజాబ్‌లోని దుల్లేవాలా కోటను స్వాధీనం చేసుకున్న సమయంలో మహారాజా ఖడగ్ సింగ్ ఆర్కైవ్స్ నుండి తీసుకున్నట్లు పరిశోధకులు భావిస్తున్నారు. ఆ తర్వాత, వలసరాజ్యాల పాలనలో కోహినూర్ వజ్రాన్ని విక్టోరియా రాణికి అందజేసిన సర్ జాన్ స్పెన్సర్ లాగిన్, ఈ పవిత్ర ప్రతిని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. 2020లో సిక్కు పరిశోధకులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా కళాఖండాల కోసం వెతుకుతుండగా ఈ అరుదైన గురు గ్రంథ్ సాహిబ్ ప్రతికి సంబంధించిన వివరాలు లభ్యమయ్యాయి. నాటి నుంచి దీనిని అత్యాధునిక సాంకేతికతతో పునరుద్ధరించి, భద్రపరిచారు. గత ఏడాది నవంబర్‌లో ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కాట్లాండ్ వ్యాప్తంగా ఉన్న సిక్కు భక్తులు ఈ పవిత్ర గ్రంథాన్ని వీక్షించారు. తాజాగా దీనిని గ్లాస్గోలోని సెంట్రల్ గురుద్వారాకు తరలించడంతో భక్తులు ఇకపై అక్కడ దర్శించుకోగలుగుతారు. ఈ పవిత్ర ప్రతిని మొదటిసారి చూడటం ఒక అద్భుతమైన అనుభూతిని కలిగించిందని 'సిక్కు సంజోగ్' సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ త్రిష్ణ సింగ్ తెలిపారు. 1930ల చివరి నుండి గ్లాస్గోలోని వసించిన తమ పెద్దలకు, ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన గ్రంథం ఇక్కడే విశ్వవిద్యాలయంలో ఉందనే విషయం తెలియకపోవడం కొంత బాధ కలిగించిందని ఆమె పేర్కొన్నారు.

# హీరోలు, దర్శకనిర్మాతలకు అర్థమవుతోందా?



2026లో అప్పుడే ఆరు నెలలు పూర్తయిపోయాయి. తెలుగులో 100కి పైగా సినిమాలు ఈ ఆరు నెల్లో థియేటర్లలో రిలీజయ్యాయి. వీటిలో ప్రేక్షకుల్ని అలరించి హిట్ అయిన మూవీస్ ఎన్ని అంటే? వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ఫ్లాప్ చిత్రాలు ఏ భాషలోనైనా ఉంటాయి. అది సహజమే. కానీ ఇంత పెద్ద సంఖ్యలో సినిమాలు విడుదలవుతున్నా ఒక్కటి సరిగా ఆడట్లేదు. దీంతో ప్రేక్షకుల కనిపించక థియేటర్లు వెలవెలబోతుండటం ఆందోళన కలిగించే విషయం. ఆ స్థాయి మూవీస్ లేక ఎగ్జిబిటర్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంతకీ ఈ ఏడాది తొలి ఆరు నెలల టాలీవుడ్ రిపోర్ట్ కార్డ్ ఏంటి? ఎన్ని మార్కులు వచ్చాయి. ఈ ఏడాది ప్రారంభంలో బాక్సాఫీస్ దగ్గర శుభారంభం దక్కింది. సంక్రాంతికి ఐదు సినిమాలు రిలీజైతే వాటిలో చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకరవరప్రసాద్'.. కుటుంబ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కించుకుంది. రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సొంతం చేసుకుంది. నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' కూడా మంచి వసూళ్లు అందుకోగా.. శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' ఊహించని హిట్‌గా నిలచి ట్రేడ్‌ని ఆశ్చర్యపరిచింది. అయితే భారీ అంచనాలతో వచ్చిన ప్రభాస్ 'రాజాసాబ్' ఘోరమైన డిజాస్టర్ కాగా.. రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' బిలో యావరేజ్ దగ్గరే ఆగిపోయింది.

ఇక ఫిబ్రవరి అయితే చాలా నీరసంగా సాగింది. జనవరి జోష్‌ని కొనసాగిస్తుందనుకుంటే.. 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రమే హిట్ అయింది. ఫంకీ, సీతా పయనం, యుఫోరియా చిత్రాలు కనీసం పెట్టుబడిని కూడా రాబట్టుకోలేకపోయాయి. విష్ణు విన్యాసం చాలా నిరాశపరిచింది. మార్చిలోనూ పెద్దగా మార్పు కనిపించలేదు. 'మృత్యుంజయ్' తేలిపోయింది. నెల చివరలో కాస్తంత హైప్‌తో వచ్చిన పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' ఉసూరుమనిపించింది. ఓపెనింగ్స్ బాగానే వచ్చినప్పటికీ రెండో రోజే దారుణమైన డ్రాప్ కనిపించింది.

ఏప్రిల్‌లో పరిస్థితి కొంతవరకు పర్లేదు. అడివి శేష్ 'డెకాయిట్' ఓకే అనిపించుకోగా.. 'రాక్షస' యావరేజ్ అయింది. 'బైకర్'కి ప్రశంసలు వచ్చినప్పటికీ అవి కలెక్షన్స్‌గా మారలేదు. వేసవిలో కీలకమైన మే నెల కూడా ఎగ్జిబిటర్లని పూర్తిగా నిరాశపరిచింది. గోదారి గట్టుపైన, జెట్ లీ, గాయపడ్డ సింహం మూవీస్ మిడ్ రేంజ్ అయినప్పటికీ కొంత ఆసక్తిగా అనిపించాయి. కానీ కమర్షియల్‌గా ఎలాంటి ప్రభావం చూపించలేకపోయాయి. ఇక జూన్ నెల పరిస్థితి కొంతవరకు పర్లేదని చెప్పొచ్చు. రామ్ చరణ్ 'పెద్ది' కలెక్షన్స్ పరంగా తెలుగు రాష్ట్రాల వరకు లాభదాయకంగా నిలిచింది. కానీ మిగతా చోట్ల ఎక్కడా అస్సలు వర్కౌట్ కాలేదు. పేరుకే పాన్ ఇండియా రిలీజ్ చేశారు గానీ అస్సలు పనవ్వలేదు. అయితే ఈ నెలలో ఊహించని సక్సెస్ ఏదైనా ఉందంటే అది 'మా ఇంటి బంగారం'. చాన్నాళ్ల తర్వాత అది కూడా సమంత చేసిన ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీ ఇది. పెద్దగా బజ్ లేనప్పటికీ థియేటర్లలో అద్భుతం చేసింది. పెట్టుబడి కంటే ఎక్కువగా కలెక్షన్స్ సాధించింది. ఇండస్ట్రీకి ఊపు తీసుకొచ్చింది. ఇక 94 ఏళ్ల దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తీసిన 'సింగ్ గీతం'.. విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది కానీ డబ్బులు రాబట్టుకోలేకపోయింది.

ఇక డబ్బింగ్‌ల విషయానికొస్తే మార్చిలో రిలీజైన 'ధురంధర్ 2'.. తెలుగు రాష్ట్రాల్లో రూ.50 కోట్ల వసూళ్లు సాధించింది. సూర్య 'వీరభద్రుడు'కి బీ,సీ సెంటర్లలో డబ్బులొచ్చాయి. అంచనాలతో వచ్చిన దృశ్యం 3, కేడీ చిత్రాలు డిజాస్టర్లు అవ్వడంతో పాటు థియేటర్లలో నుంచి త్వరగానే వెళ్లిపోయాయి. మొత్తంగా చూసుకుంటే ఈ ఏడాది తొలి ఆరు నెలలు పూర్తి సంతృప్తి ఇవ్వలేకపోయాయి. మన శంకరవరప్రసాద్, నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు, పెద్ది, మా ఇంటి బంగారం మూవీస్ మాత్రమే హిట్. అంటే 95 శాతం సినిమాలు యావరేజ్, ఫ్లాప్, డిజాస్టర్లు అయ్యాయి! దీంతో సెకండాఫ్‌లోనైనా హిట్స్ శాతం పెరుగుతుందేమోనని హీరోలు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## టీనేజీలో చేదు అనుభవం..

రీసెంట్ టైంలో ట్రెండింగ్ హీరోయిన్ అంటే కచ్చితంగా వినిపించే పేరు కాయదు లోహర్. 'ముఖిల్ పేట్టై' అనే కన్నడ మూవీతో హీరోయిన్ అయిన ఈ అస్సామీ బ్యూటీ.. 'అల్లూరి'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. కానీ వర్కౌట్ కాలేదు. ఎప్పుడైతే తమిళంలో 'డ్రాగన్' చేసింది ఈమె దశ తిరిగిపోయింది. తెలుగు, తమిళ, మలయాళంలో నటిస్తూ బిజీ అయిపోయింది. ఈ ఏడాది ఇప్పటికే ఫంకీ, పళ్లిచట్టంబి చిత్రాలతో వచ్చింది. ఇప్పుడు సూర్యతో నటించే ఛాన్స్ కొట్టేసింది. రెండురోజుల క్రితమే ఈ ప్రాజెక్టు అధికారికంగా ప్రకటించారు. ఇకపోతే తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు 16 ఏళ్లున్నప్పుడు జరిగిన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకుంది. 'పదో తరగతి చదువుకుంటున్న రోజుల్లో మా ఇంటికి దగ్గరలోనే ట్యూషన్‌కు వెళ్తుండేదాన్ని. ఒకరోజు ఒక కుర్రాడు నన్ను ఫాలో అవుతూ ఈవ్ టీజింగ్ చేశాడు. పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ నా వెంట పడుతూ హద్దులు మీరడంతో కోపం కట్టలు తెంచుకుంది. అంతే పక్కనే ఉన్న పెద్ద రాయి తీసి అతడి తల మీద కొట్టా. రక్తం కారడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాను' అని కాయాదు లోహర్ గుర్తుచేసుకుంది. చూడటానికి నేను చాలా సాఫ్ట్‌గా కనిపించినా.. ఎవరైనా తప్పు చేస్తే నాలోని కోపం బయటికి వస్తుందని, దానికి ఎదురు వెళ్తాను. అవసరమైతే మళ్లీ మళ్లీ కొడతానని కాయదు చెప్పుకొచ్చింది. ఈమె నాని 'ప్యారడైజ్' మూవీలోనూ నటిస్తోంది. వచ్చే నెల చివరలో ఆ చిత్రం థియేటర్లలోకి రావాల్సి ఉంది.

## ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను



టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.



## మరో 80 రోజులు మాత్రమే

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ అండ్ టైమ్‌ట్రావెల్ అడ్వెంచరస్ యాక్షన్ సినిమా 'వారణాసి'. ఈ చిత్రంలో రాముడిగా, రుద్రగా ద్వి పాత్రాభినయం చేస్తున్నారు మహేశ్‌బాబు. మందాకిని పాత్రలో ప్రియాంకా చోప్రా, కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ , శివ భక్తుడి పాత్రలో ప్రకాష్ రాజ్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌కు చిన్న బ్రేక్ పడింది. హీరో మహేశ్‌బాబు విహారయాత్రలో భాగంగా విదేశాల్లో ఉండగా, దర్శకుడు రాజమౌళి ప్యారిస్‌లో ఉన్నారు. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన గత చిత్రాలు 'ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్' సినిమాలు ప్యారిస్‌లోని థియేటర్స్‌లో ప్రదర్శితం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన అక్కడ ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రాజమౌళి 'వారణాసి' సినిమా అప్‌డేట్స్‌ను వెల్లడిస్తున్నారు. 'వారణాసి' సినిమాకు సంబంధించిన మేజర్ సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందని, అక్టోబరు కల్లా మొత్తం షూటింగ్ పూర్తవుతుందని రాజమౌళి చెప్పిన సంగతి తెలిసిందే.

తాజాగా 80 రోజులు షూటింగ్ జరిపితే 'వారణాసి' సినిమా చిత్రీకరణ పూర్తవుతుందని రాజమౌళి తెలిపారు. ఇక ఈ నెల మూడోవారంలో 'వారణాసి' సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం అవుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ లోపు రాజమౌళి, మహేశ్ బాబు తమ కార్యక్రమాలను విదేశాల్లో పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు రానున్నారు. ఎస్ఎస్ కార్తికేయ, కేఎల్ నారాయణ నిర్మిస్తున్న 'వారణాసి' ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.



## వినోదాలు పంచే రంభ ఊర్వశి మేనక

'అల్లరి' నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. 'కామెడీ గోస్ కాస్మిక్' అన్నది 'ట్యాగ్‌లైన్ '. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నరేష్ వీకే, 'వెన్నెల' కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్- హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీ సెప్టెంబరు 4న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. జూన్ 30న 'అల్లరి' నరేష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''అల్లరి' నరేష్ నటిస్తున్న 65వ చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. విభిన్నమైన కథలు, మంచి కంటెంట్ చిత్రాలతో ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తున్న నరేష్ తనను హీరోగా నిలబెట్టిన కామెడీ జానర్‌లో మరోసారి సందడి చేయనున్నారు. ఫాంటసీకి వినోదాన్ని జోడిస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమా వినోదభరితమైన ఘటనలతో సరికొత్త థియేట్రికల్ అనుభూతిని అందించనుంది. నరేష్ వీకే, 'వెన్నెల' కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, కెమెరా: రాంరెడ్డి.

## సంక్రాంతి బరిలో కామెడీ మల్టీస్టారర్



'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో 2026 సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన హీరో రవితేజ 2027 సంక్రాంతి పండక్కి కూడా ఆడియన్స్ ముందుకు రానున్నారట. రవితేజ హీరోగా 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్‌గోలి దర్శకత్వంలో ఓ సినిమా రానుందని, ఈ చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మించనున్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. కథ రీత్యా ఇది మల్టీస్టారర్ మూవీ అని, రవితేజతో పాటు శ్రీవిష్ణు మరో లీడ్ రోల్‌లో నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రంపై అధికారిక ప్రకటన రానుందని, ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేలా యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే సంక్రాంతికి ఈ సినిమాని రిలీజ్ చేయాలని యూనిట్ లక్ష్యంగా పెట్టుకుందట. మరి.. ప్రచారంలో ఉన్నట్లు ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల అవుతుందా? లేదా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇదిలా ఉంటే రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇరుముడి' సినిమా ఆగస్టు 21న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే.

## ఒక్కొక్కరిగా వస్తారా? ఒకేసారి వస్తారా? 'టాక్సిక్' కొత్త టీజర్



'కేజీఎఫ్' తర్వాత యష్ హీరోగా చేసిన సినిమా 'టాక్సిక్'. ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడింది. ఎట్టకేలకు ఆగస్టు 26న రిలీజ్ అని ప్రకటించారు. ఇప్పటికే టీజర్, ఓ పాట వదలగా అవేం పెద్దగా బజ్ క్రియేట్ చేయలేకపోయాయి. ఇప్పుడు సడన్‌గా లేడీస్ స్పెషల్ పేరిట హీరోయిన్లతో ఓ టీజర్ రిలీజ్ చేశారు. టాక్సిక్ మూవీలో హీరోయిన్లు నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి ఉన్నారు. అయితే వీళ్లలో ఎవరు హీరోయిన్? ఎవరికి కీలక పాత్రలు అనేది తెలియాల్సి ఉంది. తాజాగా రిలీజ్ చేసిన వీడియోలో అయితే నయనతార, రుక్మిణి వసంత్ గన్స్ పట్టుకుని కనిపించగా.. కియారా, హ్యూమా, తారా గ్లామర్ చూపించారు. యష్.. లేడీ ఫైటర్స్ చేసిన యాక్షన్ ఇందులో చూపించారు. మధ్యమధ్యలో రొమాన్స్ చూపిస్తూ మరోవైపు ఫైట్స్ చూపిస్తూ ఆసక్తి కలిగించారు. గీతూ మోహన్‌దాస్ ఈ చిత్రానికి దర్శకురాలు.

# చిన్న రోబో అడిగిన ప్రశ్న..
## ఏఐ జమానాలోనూ జవాబు లేదు!

**ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్ అంటే ఊహలకు రెక్కలు తొడిగిన కథలు గుర్తొచ్చేవి. ఎగిరే కార్లు, అంతరిక్ష యుద్ధాలు, భవిష్యత్తు నగరాలు... అలాంటి కలల ప్రపంచమే ఆ తరహా సినిమాల ప్రత్యేకత. కానీ కాలం మారింది. ఇప్పుడు కృత్రిమ మేధస్సే(AI) ప్రపంచాన్ని నడిపిస్తోంది. మనతో మాట్లాడుతోంది. మనకోసం రాస్తోంది. చిత్రాలు గీస్తోంది. సంగీతం సృష్టిస్తోంది. మనిషి చేసే పనుల్లో చాలావరకు తనదైన ముద్ర వేస్తోంది. అయితే..**

ఈ అద్భుతాలన్నింటి మధ్య ఇప్పటికీ సమాధానం దొరకని ఒక ప్రశ్న ఉంది.. ప్రేమను కూడా సృష్టించగలమా?. ఆ ప్రశ్నను ప్రపంచం ముందు పాతికేళ్ల క్రితమే నిలబెట్టింది A.I. Artificial Intelligence అనే ఆంగ్ల చిత్రం. ఇది యంత్రాల గురించి తీసిన సినిమా కాదు. మనిషిలా ప్రేమించాలనుకున్న ఒక చిన్నారి గురించి చెప్పిన కథ. రక్తమాంసాలు లేని శరీరంలోనూ మనసు ఉంటే ఎలా ఉంటుందో చూపించిన అరుదైన చిత్రం. సాంకేతిక అద్భుతాల కన్నా భావోద్వేగాలకే పెద్దపీట వేసిన సినిమా. ఈ కథ వెనుక కూడా ఒక కథే ఉంది. ఎన్నో ఏళ్ల పాటు ఈ ఆలోచనను తనలో మోసిన దర్శకుడు స్టాన్లీ కుబ్రిక్. ఒక రోబో బాలుడు తన తల్లి ప్రేమ కోసం వెతికే కథ ఆయనకు ఎంతో నచ్చింది. అయితే అప్పటి సాంకేతిక పరిజ్ఞానంతో ఆ కథను తాను అనుకున్న స్థాయిలో తెరకెక్కించడం సాధ్యం కాదని భావించి, దాదాపు రెండు దశాబ్దాల పాటు దానిపై పరిశోధన చేశారు. కానీ దాన్ని తెరపైకి తీసుకురాకముందే ఆయన వెళ్లిపోయారు(1999). ఆ కలను ఆయన సన్నిహితుడు, మరో దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ Steven Spielberg తన భుజాలపై వేసుకున్నారు. ఒకరి ఆలోచన, మరొకరి హృదయం కలిసినప్పుడు పుట్టిన చిత్రమే A.I. Artificial Intelligence.

2001 జూన్ 29న A.I. Artificial Intelligence రిలీజ్‌అయ్యింది. జులై మొదటి వారంలో భారత్‌లో విడుదలయ్యింది. విడుదలైన రోజున ఈ చిత్రాన్ని అందరూ అర్థం చేసుకోలేదు. కొందరికి ఇది చాలా నెమ్మదిగా అనిపించింది. మరికొందరికి ముగింపు భారంగా అనిపించింది. కానీ మంచి కళకు కాలమే న్యాయనిర్ణేత. సంవత్సరాలు గడిచేకొద్దీ ఈ సినిమాకు అభిమానులు పెరిగారు. నేడు ప్రపంచ సినీ చరిత్రలో భావోద్వేగానికి కొత్త అర్థం చెప్పిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమాను చాలామంది "కుబ్రిక్ మేధస్సు, స్పీల్‌బర్గ్ హృదయం కలిసిన చిత్రం" అని అభివర్ణిస్తారు.

ఈ కథలో డేవిడ్ అనే చిన్న రోబో ఉంటాడు. చూడటానికి పిల్లాడే. మాట్లాడతాడు. నవ్వుతాడు. ఏడుస్తాడు. కానీ అతడిని మిగతా యంత్రాలన్నింటి నుంచి వేరు చేసింది ఒక్కటే. అదే.. ప్రేమించే గుణం. అయితే ఒక కుటుంబం అతడిని తమ బిడ్డగా అంగీకరిస్తుంది. అతడు కూడా ఆ మహిళను యజమానిగా కాదు... అమ్మగా భావిస్తాడు. ఆ ప్రేమలో ఎలాంటి స్వార్థం ఉండదు. ఎలాంటి లెక్కలు ఉండవు. ఒక చిన్నారి హృదయం మాత్రమే ఉంటుంది. కానీ జీవితం ఒక్కసారిగా మారిపోతుంది. పరిస్థితులు అతడిని ఆ ఇంటి నుంచి దూరం చేస్తాయి. అయినా అతడు వదిలిపెట్టడు. అమ్మ మళ్లీ తనను దగ్గరకు తీసుకుంటుందనే ఆశతో ప్రయాణం మొదలుపెడతాడు. అక్కడే ఈ సినిమా మనసును తాకుతుంది. ఎందుకంటే ఆ ప్రయాణం ఒక రోబోది కాదు. ప్రేమ కోసం ఎదురుచూసే ప్రతి మనిషిది.



ఈ చిత్రం విడుదలైనప్పుడు కృత్రిమ మేధస్సు అనేది కొద్దిమంది శాస్త్రవేత్తల చర్చల్లో మాత్రమే ఉండేది. ఇప్పుడు అదే ప్రతి ఇంట్లోకి వచ్చింది. ప్రతి చేతిలోని ఫోన్‌లో ఉంది. ప్రతి కార్యాలయంలో ఉంది. మన జీవితంలో భాగమైపోయింది. కానీ ఎంత మారినా... డేవిడ్ అడిగిన ప్రశ్న మాత్రం ఇంకా అలాగే నిలిచిపోయింది. ఒక యంత్రం నిజంగా ప్రేమిస్తుందా? లేక ప్రేమిస్తున్నట్లు మాత్రమే కనిపిస్తుందా?

చాలా సినిమాలు యంత్రాలు ప్రపంచాన్ని జయిస్తాయని ఊహించాయి. ఈ సినిమా మాత్రం ప్రపంచం ఒక చిన్న యంత్రాన్ని ఎలా ఒంటరిగా వదిలేసిందో చూపించింది. అందుకే కాలం గడిచినా దీని విలువ ఏమాత్రం తగ్గలేదు. ఇది భవిష్యత్తును ఊహించినందుకు గొప్ప సినిమా కాదు. భవిష్యత్తులో మనిషి ఏం కోల్పోవచ్చో ముందే హెచ్చరించిన సినిమా కాబట్టే గొప్పది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com